

ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 39.0
కనిష్ఠం : 21.0

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6:19 (గురు)
సహరి : 4:55 (శుక్ర)



అగ్రి ల్యాబ్ అవస్థలు

» రైతులకు నామమాత్రపు సేవలు

» వేధిస్తున్న సిబ్బంది కొరత

కైకలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): రైతులకు మెరుగైన సేవలందిస్తామంటూ గత వైసీపీ ప్రభుత్వం కైకలూరులో అగ్రి ల్యాబ్‌ను రూ.66.50 లక్షలతో నిర్మించారు. దీని నిర్వహణకు సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడంతో పూర్తి స్థాయిలో వినియోగంలోకి రాలేదు. కైకలూరు వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీలో గత వైసీపీ ప్రభుత్వం అగ్రి ల్యాబ్ ద్వారా భూసార పరీక్షలు, పశు సంవర్థక శాఖ చెందిన పరీక్షలు ఆక్వా కల్చర్ అభివృద్ధిలో భాగంగా టెస్టింగ్ ల్యాబ్‌లు ఏర్పాటు కోసం నూతనంగా భవనం నిర్మాణం చేసి అగ్రి టెస్టింగ్‌ల్యాబ్ ప్రారంభించారు. భూసార పరీక్షలు, పంటసాగులో రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు, ప్రభుత్వం ఉచితంగా కల్పించే సేవలు, విత్తనాల నాణ్యత, పశువులకు సంబంధించిన వ్యాధుల నిర్ధారణ, ధాన్యాల నాణ్యత పరీక్షలు వంటి సేవలందించాల్సి ఉంది. అయితే సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమించకపోవడంతో వ్యవసాయశాఖ సిబ్బందికి అక్కడ విధులు కేటాయిస్తున్నారు.

అరకొర సేవలే..

అగ్రిల్యాబ్‌లో విత్తనపు శుద్ధి మినహా ఏ సేవలు అందుబాటులో లేవు. అందుకు కావాల్సిన పూర్తిస్థాయి సామగ్రి ఏర్పాటు చేయలేదు. దీంతో అన్నిరకాల సేవలు నామమాత్రంగానే జరుగుతున్నాయి. కొన్ని పరికరాలను ఏర్పాటుచేసినా అందుకు కావాల్సిన రసాయనాలు అందుబాటులో లేవు. దీంతో రైతులకు అగ్రి ల్యాబ్ ఏ విధంగాను ఉపయోగపడడం లేదు.

పట్టభద్రుల తీర్పులో కొత్త కోణం

ఉమ్మడిగా కదిలారు.. కదిలించారు

» వైసీపీ సహా ఇతరుల ఊహలు తల్లకిందులు

» పేరాబత్తుల గెలుపుతో కూటమిలో ఉత్తేజం

» ఎమ్మెల్సీ ఎన్నికల సరళిపై అధినాయకత్వం సంతృప్తి





ఏలూరులో పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తులతో కలిసి నామినేషన్ వేసేందుకు ర్యాలీగా వస్తున్న మంత్రులతోపాటు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ప్రజా ప్రతినిధులు, నాయకులు (ఫైల్) బ్యాలెట్ పత్రాల లెక్కింపు (ఇన్‌సెట్‌లో)

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో విజయం సాధించడమంటే ఆషామాషీ వ్యవహారం కాదు. ఉభయ జిల్లాలో ఒకే ఒరవడి ఉన్న కొన్ని నియోజకవర్గాల్లో భిన్నాభిప్రాయాలు చోటు చేసుకుంటాయి. తర్జనభర్జనలు సాగుతాయి. రాజకీయాల్లో ఎత్తులు, పైఎత్తులు, సామాజిక అంశాలు ఒకదాని వెంట మరొకటి పరుగులు తీస్తాయి. అయినా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి నేతలంతా ఉమ్మడిగా కేడర్‌ను, ఓటరును కలిపి విజయం దక్కించుకోగలిగారు.

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ గెలుపు కూటమిలో కొత్త జోష్‌ను నింపింది. ఈఎన్నికలు ఒక దశలో కూటమి ప్రభుత్వానికి కొత్త సవాల్‌గానే కనిపించింది. సాధారణ రాజకీయాలు మాదిరిగా కాకుండా పట్టభద్రులందరినీ కూడదీసి పార్టీకి అనుకూలంగా రంగంలోకి దింపి చివరికి వారంతా తమకే మద్దతు ఇచ్చేలా ఒప్పించి, మెప్పించి ఓటింగ్ సాధించాలి. ఈ క్రమంలోనే తొలిసారిగా ఈ తరహా నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థిని కూటమి రంగంలోకి దింపింది. ఈ నిర్ణయం కూటమిలో అనేక సవాళ్లకు దారితీసింది. ప్రతిపక్షాల్లో ఉన్న మిగతా వారికి పెను సవాల్‌ను విసిరించింది. పట్టభద్రుల ఓటర్ల నియోజకవర్గంలో ప్రతీ ఐదేళ్లకోసారి ఓటర్ల నమోదు కొనసాగాలి. దీనిలోను కూటమి జాగ్రత్తపడింది. నియోజకవర్గాల వారీగా సీనియర్లతో సంప్రదింపులు జరిపారు. ఒక దశలో ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షా 23 వేల మందికి పైగా ఓటర్లు మాత్రమే జాబితాలో చేరారు. దీంతో పట్టభద్రులను ఓటర్లుగా చేర్పించే వ్యూహం రచించి ఆ బాధ్యతను పార్టీ నియోజకవర్గ కన్వీనర్లకు, సీనియర్లకు, పార్టీ జిల్లా అధ్యక్షులకు, మంత్రులకు అప్పగిస్తూ అధిష్ఠానం పరీక్ష పెట్టింది. ఓటర్ల సంఖ్య పెరగాల్సిందే తప్ప గతంకంటే తగ్గుదల ఉండకూడదని సీఎం చంద్రబాబు స్వయంగా ఆదేశాలు ఇచ్చారు. ఒక్క టీడీపీయే కాకుండా కూటమి భాగస్వా మ్య పక్షాలైన బీజేపీ, జన సేనను సైతం సమాతరంగా కదిపారు. నియోజకవర్గాల్లో ఆయా పార్టీల ఎమ్మెల్యేలకు ఏరోజుకారోజు ఓటర్ల చేరికలో పురోగతిని పరిశీలించే బాధ్యతను అప్పగించారు. వీరితోపాటు నియో జకవర్గ పరిశీలకులను రంగంలోకి దింపారు. అంతే ఓటర్ల సంఖ్య కాస్తా మూడు లక్షలకు పైగా దూసుకెళ్లింది.

ఉమ్మడిగా కదిలి పట్టభద్రులను ఒప్పించి..

తెలుగుదేశం కేడర్‌లో ఉత్సాహం నింపేందుకు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆసాంతం ప్రయత్నించారు. ఈ బాధ్యతను ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం పూర్తిగా స్వీకరించారు. మంత్రులు నిమ్మల రామానాయుడు, కొలుసు పార్థసారథి ఒకవైపు, ఎమ్మెల్యేలు ఇంకోవైపు పార్టీ పరిశీలకులు మూడోవైపు నియోజకవర్గాల్లో రోజువారీగా సమీక్షించగలిగారు. మరోవైపు పోటీలో ఉన్న అభ్యర్థులు ఏపీ ప్రాంతాల్లో ఎంతెంత సంఖ్యలో పట్టభద్రులను ఆకట్టుకోగలిగారో ఆరా తీశారు. జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, మంతెన రామరాజు ఈ విషయంలో చొరవ తీసుకున్నారు. పీడీఎఫ్ అభ్యర్థి వీరరాఘవులు వైపే ఉద్యోగులు మొగ్గు చూపుతున్నారని ఒకదశలో ప్రచారం సాగింది. దీనిని గమనించి ఓటర్ల జాబితాలోని ఉద్యోగులతోను సంప్రదించి మద్దతు ఇవ్వాల్సిందిగా అభ్యర్థించి సఫలమయ్యారు. మొత్తంగా ఉమ్మడిగా అందరినీ కూడగట్టుకున్న ఫలితంగానే టీడీపీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం భారీ ఆధిక్యతతో గెలుపొందగలిగారు. వైసీపీతో పాటు మిగతా పక్షాలు తెలుగుదేశం ఓటమి పాలైతే ఆ మేరకు లబ్ధి పొందవచ్చన్న ఊహలకు పట్టభద్రులే చెక్ పెట్టినట్టయ్యింది. దీనికితోడు ఉభయ గోదావరి జిల్లాల్లో నేతలంతా ఎక్కడా వివాదాలు లేకుండా సమయస్ఫూర్తితో గెలుపే లక్ష్యంగా ఉమ్మడిగా పని చేయడం, గత సాధారణ ఎన్నికల కంటే అత్యధికంగానే పనిచేసినట్టయ్యింది.

రౌండ్‌ల వారీగా ఓట్లు.. ఆధిక్యత	1వ రౌండ్	2వ రౌండ్	3వ రౌండ్	4వ రౌండ్	5వ రౌండ్	6వ రౌండ్	7వ రౌండ్	8వ రౌండ్	మొత్తం
పేరాబత్తుల రాజశేఖరం	16,520	16,212	16,191	15,482	15,632	16,254	16,040	12,371	1,24,702
దిడ్ల వీర రాఘవులు	5,815	5,421	5,570	6,446	6,413	5,949	5,654	5,973	47,241
విజేత ఆధిక్యత	10,705	10,791	10,621	9,036	9,219	10,305	10,386	6,398	77,461



పోలవరం-యడవల్లి మధ్య తమ్మిలేరుపై వంతెన నిర్మించాల్సిన ప్రదేశం

కల నెరవేరేనా..?

» ఏళ్ల తరబడి తమ్మిలేరుపై వంతెనల కోసం వినతులు

» అమలుకు నోచుకోని ప్రజాప్రతినిధుల హామీలు

» నిధులు మంజూరయ్యేనా.. ప్రజల ఎదురుచూపు

చాట్రాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):చాట్రాయి మండలం సరిహద్దుగా ప్రవహిస్తున్న తమ్మిలేరుపై పోలవరం-యడవల్లి, చీపురుగూడెం-మల్లాయిగూడెం, కోటపాడు-పోతునూరు గ్రామాల మధ్య వంతెనలు నిర్మించాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. 2004-2009 మధ్య తిరువూరు ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రిగా పని చేసిన కోనేరు రంగారావు కేంద్ర నిధులు తెచ్చి ఈ మూడు వంతెనలు నిర్మిస్తామని హామీ ఇచ్చినా నెరవేరలేదు. దశాబ్దాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు ఇచ్చిన హామీలు నీటి మూటలయ్యాయి. గత ఎన్నికల్లో నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి ఇచ్చిన హామీ మేరకు పోలవరం-యడవల్లి గ్రామాల మధ్య తమ్మిలేరుపై వంతెన నిర్మాణానికి పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారులు రూ.6.5 కోట్లు, రోడ్ల నిర్మాణానికి రూ.1.30 కోట్ల అంచనాలతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. పోలవరం నుంచి తమ్మిలేరు వరకు రోడ్డు నిర్మాణానికి ఏడాది క్రితం నాబార్డు రూ.1.90 కోట్లు మంజూరు చేసింది. ఈ పనులు త్వరలో ప్రారంభించనున్నట్టు సమాచారం. గతంలో తమ్మిలేరు దాటే క్రమంలో ఎంతో మంది మృత్యువాత పడ్డారు. గత స్థానిక ఎన్నికల్లో కోటపాడులో వైసీపీ తరపున సర్పంచ్‌గా పోటీ చేసిన పరసా సత్యనారాయణ (సత్తిపండు) తనను గెలిపిస్తే కోటపాడు-పోతునూరు మధ్య తమ్మిలేరుపై కల్వర్టు నిర్మిస్తానని, ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోతే సొంత నిధులతో నిర్మిస్తానని వాగ్దానం చేసి గెలిచారు. ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో సొంత నిధులతో పైప్ కల్వర్టు నిర్మాణం కొంతవరకు పనులు చేశారు. త్వరలోనే మిగిలి పనులను పూర్తి చేసి కల్వర్టు వినియోగంలోకి తెస్తానని ఆయన తెలిపారు.

వంతెనలు నిర్మించాలి

ప్రభుత్వం తమ్మిలేరుపై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి. తరాల తరబడి నుంచి వంతెనలు నిర్మిస్తారని ఆశతో ఎదురు చూస్తున్నాం. వర్షాకాలంలో తమ్మిలేరు దాటి వ్యవసాయ పనులకు వెళ్లి రావడానికి ప్రాణాలు అరచేత పట్టుకుంటున్నాం. కూటమి ప్రభుత్వం బ్రిడ్జిలు నిర్మిస్తుందని కొండంత ఆశతో ఉన్నాం.

- మొలుగుమాటి బాబూరావు, పోలవరం

పురుషులకు గోల్డెన్ ఛాన్స్

» పురుషుల ఆర్థికాభివృద్ధి దిశగా ప్రభుత్వం చర్యలు

» గ్రూపుల ఏర్పాటులో మెప్మా అధికారులు బిజీబిజీ

» ఉమ్మడి గోదావరి జిల్లాల్లో 65 సంఘాల ఏర్పాటు

» వచ్చే నెల నుంచి అమల్లోకి.. ఆరు నెలల పొదుపు తర్వాత రూ.లక్ష వరకు రుణాల మంజూరు

పురుషులు వ్యాపార వేత్తలు కావాలని అనుకుంటున్నారా ? చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగించుకుంటున్నారా అయితే ప్రభుత్వం పురుషులకు సువర్ణావకాశం కల్పిస్తోంది. మహిళలకు ఉన్న గ్రూపుల మాదిరి పురుషులతోను గ్రూపులను ఏర్పాటు చేసి వారిని ఆర్థికంగా బలోపేతం చేసే దిశ చర్యలు తీసుకుంటోంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో ఇప్పటి వరకు 65 గ్రూపులను ఏర్పాటు చేశారు. పశ్చిమలో 33, ఏలూరు జిల్లాలో 32 గ్రూపులు ఏర్పాటు చేశారు. ఇవి వచ్చే నెల నుంచి అమలులోకి రానున్నాయి. అలాగే ఈ సంఖ్యను రెట్టింపు చేసే పనిలో అధికారులు ఉన్నారు.

(భీమవరం టౌన్-ఆంధ్రజ్యోతి) :

పట్టణాల్లో డ్వాక్రా, స్వయం సహాయక మహిళా సంఘాల తరహాలోనే పురుషులతోనూ స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసేందుకు నిర్ణయించి ఆ మేరకు ప్రణాళికలు రూపొందించి చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటివరకు నగరాల్లో అమలు చేసిన తరువాత ఇప్పుడు అన్ని పట్టణాలు, అట్టడుగున ఉన్న బలహీన వృత్తిగ్రూపులు ఏర్పాటుపై దృష్టి పెట్టి. పురుష గ్రూపులు ఏర్పాటు మొదలు పెట్టింది. మెప్మా ఆధ్వర్యంలో గ్రూపులు ఏర్పాటు చేస్తున్నారు. మహిళా సంఘాల మాదిరిగానే పురుష పొదుపు సంఘాల్లోనూ కార్యకలాపాలు నిర్వహించనున్నారు. ఆర్థిక సాయం అందించి, ఉపాధి కల్పించడం వంటి లక్ష్యాలను పురుషుల స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలు సాధించాలనేది ప్రభుత్వ ఉద్దేశం. ఈ గ్రూపులపై సభ్యులకు అవగాహన కల్పిస్తున్నారు.

ఐదుగురు సభ్యులతో గ్రూపు..

మహిళా స్వయం సహాయక సంఘాల్లో గ్రూపునకు పది మంది సభ్యులుంటారు. పురుషుల సంఘంలో మాత్రం ఐదుగురు సభ్యులుంటే సరిపోతుంది. ఈ పథకంలో వలస కూలీలు, అసంఘటిత రంగంలోని భవన నిర్మాణ కార్మికులు తాపీమేస్త్రీలు, కార్పెంటర్లు, పెయింటర్లు, ప్లంబర్లు, ఎలక్ట్రీషియన్లు, కూలీలు, ఆన్లైన్ డెలివరీ బాయ్స్, కూరగాయలు, వృత్తి, నిత్యావసరాలు సరఫరా చేసే కార్మికులు, ఆటోరిక్షా కార్మికులు, హమాలీలు, తోపుడు బండ్లపై వ్యాపారాలు చేసే చిరువ్యాపారులు, వృద్ధులు, పిల్లల సంరక్షణ కేంద్రాలు, ఇళ్లల్లో పనిచేసుకునేవారు. ఇలా అనేక వర్గాలు సభ్యులుగా చేరవచ్చు.

రూ.లక్ష నుంచే పైనే..

ప్రతి గ్రూపు నెలనెలా సమావేశమై ఒక్కొక్క సభ్యుడు కనిష్ఠంగా రూ.100 నుంచి రూ.200వరకు పొదుపు చేయాల్సి ఉంటుంది. ఆరు నెలల తర్వాత ప్రతి గ్రూపునకు పొదుపు మొత్తంలో ఆరు రెట్లు, లేక రూ.లక్ష నుంచి ఆపై బ్యాంకు రుణాలుగా ఇస్తారు. ఈ సొమ్మును కుటుంబ అవసరాలు, ఉపాధి మెరుగు పరచుకునేందుకు అవకాశం కలుగుతుంది. గ్రూపు సభ్యులు బ్యాంకు రుణాలు సకాలంలో చెల్లిస్తే మళ్లీ అదనపు రుణాలు ఇస్తారు. అదేవిధంగా మహిళా ఎస్సీ, ఎస్టీలకు ఇచ్చినట్లే బ్యాంకు లింకేజీ రుణాలు, పావలా వడ్డీ, సున్నావడ్డీ రుణాలు ఈ పురుష ఎస్సీ, ఎస్టీలకు వర్తిస్తాయని అధికారులు చెబుతున్నారు.

ఆరు నెలల తర్వాత రుణం మంజూరు

పురుషులకు గ్రూపులు ఏర్పాటు చేయడం వల్ల ఆర్థికంగా బలోపేతం అయ్యేందుకు వీలు కలుగుతుంది. గ్రూపు ఏర్పడి ప్రతీనెల పొదుపు చేసుకుంటే మూడు నెలల తరువాత వారికి రూ.20 వేలు రివాల్వింగ్ ఫండ్ మంజూరవుతుంది. ఆరు నెలల తరువాత వారికి బ్యాంకుల ద్వారా లక్ష రూపాయలకు పైగా రుణం వస్తుంది.

- సీహెచ్ నానిబాబు
జీవనోపాధి నిపుణుడు





పురుష గ్రూపులపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఉమ్మడి పశ్చిమ జిల్లా మునిసిపాల్టీల్లో గ్రూపులు

- భీమవరం-6, నరసాపురం-2, పాలకొల్లు-2, తాడేపల్లిగూడెం-15, తణుకు-5, ఆకివీడు-3 : మొత్తం 33
- ఏలూరు - 13, జంగారెడ్డిగూడెం-7, నూజివీడు-10, చింతలపూడి-2 : మొత్తం 32

గ్రూపుల్లో చేరేందుకు చాలామంది ఆసక్తి చూపుతున్నారని ఏప్రిల్ నాటికి అన్ని మునిసిపాల్టీల్లో ఈ గ్రూపులు ఏర్పాటు చేయనున్నారు.

అన్నదాతల ఆందోళన

సమస్యలపై పోరుబాట

ఏలూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని మోదీ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక విధానాలపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. సంయుక్త కిసాన్‌మోర్చా దేశవ్యాప్త పిలుపు మేరకు కేంద్రం రైతాంగానికి ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల జిల్లా సమన్వయ సమితి ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తీసుకురావాలని నినాదాలు చేశారు. రాష్ట్రసహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు కట్టా భాస్కర్ రావు, రైతుకూలీ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి షేక్ బాషా, బీకేఎంయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు తదితరులు మాట్లాడారు. మద్దతు ధరలు గ్యారెంటీ చట్టం తేవాలన్నారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరరావును కలిసి వినతిపత్రం అందజేశారు. నాయకులు జి.పాపారావు, సుభాష్‌చంద్రబోస్, రాజా, వై.శ్రీరామచంద్రమూర్తి, కొమరం రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించండి..

ఉపాధి లేని గ్రామీణ పేదలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించి, వలసలు నివారించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం (బీకేఎంయూ) నాయకులు బుధవారం జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వర రావును కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా తొలుత వ్యవసాయ కార్మికసంఘం నాయకులు బుధవారం కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. గ్రామీణపేదలు వలసల నివారణకు ఏడా దికి 200రోజులు ఉపాధిహామీ పనులు కల్పించి, రోజు కూలీ రూ.700 ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. జిల్లా అధ్య క్షుడు బండి వెంకటేశ్వరరావు, జి.బాల ఏసు, పొట్టేలు పెంటయ్య, జి.ఆశీర్వాదం, కె.నాగేశ్వరరావు, ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె విరమణ ఒప్పందాలు అమలు చేయండి..

ఏలూరు అర్బన్ : ప్రభుత్వంతో చేసుకున్న సమ్మె విరమణ ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఏపీ సమగ్రశిక్ష కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమాఖ్య జేఏసీ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లా కార్యాలయ ఉద్యో గులు దశలవారీ ఆందోళనను బుధవారం ప్రారంభించారు. తొలిరోజు ఆందోళనలో భాగంగా మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసనలో సంఘ జేఏసీ జిల్లా అధ్యక్షుడు కె.వినోద్‌కుమార్ మాట్లాడుతూ సమ్మెకాలంలో ప్రభుత్వంతో చేసుకున్న ఒప్పందం ప్రకారం ఉద్యోగులకు హెచ్ఆర్ పాలసీ అమలుకు కమిటీ నియామకం, మినిమం టైం స్కేల్, వేతనాల పెంపు, ఈపీఎఫ్ అమలు, ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంపు, గ్రాట్యుటీ అమలు వంటి కీలక విషయాలన్నీ ఇప్పటికీ పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారం కోసం ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎటువంటి స్పందనలేదన్నారు. సంఘ జిల్లా మహిళా కార్యదర్శి కె.రాజ్యలక్ష్మి మాట్లాడుతూ దశలవారీ ఆందోళనలో భాగంగా బుధ, గురువారాల్లో అన్ని మండల కేంద్రాలు, కేజీబీవీ పాఠశాలల వద్ద మధ్యాహ్న భోజన విరామసమయంలో సామూహిక నిరసనలు, ఈ నెల 8న ఏలూరులో మహిళా ఉద్యోగుల సమస్యలపై సదస్సు, 11న విజయవాడలో నిరసన దీక్షలను చేపడతామన్నారు.



ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వివిధ సంఘాల నాయకులు



ఎస్ఎస్ఏ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

ట్రెజరీశాఖకు బ్యాలెట్ పత్రాలు

జడ్పీ సీఈవో పర్యవేక్షణలో ఖాళీ బ్యాలెట్ బాక్సుల తరలింపు

ఏలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ కౌంటింగ్ ప్రక్రియ పూర్తి కావడంతో అధికారుల పర్యవేక్షణలో బ్యాలెట్ పత్రాలను ట్రంకు పెట్టెల్లో భద్రపరచి ట్రెజరీశాఖకు అప్పగించారు. కలెక్టరేట్‌లోని ట్రెజరీ కార్యాలయంలోని ఓ గదిలో ఈ పత్రాలను ఆర్నెళ్ల పాటు భద్రపరుస్తారు. వీటిని బుధవారం తెల్లవారుజామున ట్రెజరీశాఖ పర్యవేక్షణలో వాటిని స్వీకరించి ఆ రూమ్‌కు సీల్ వేశారు. ఎవరైనా ఎన్నికపై ఛాలెంజ్ చేసే పరిస్థితి వస్తే, వీటిని బయటకు తీస్తారు. లేకపోతే ఆరు నెలలు తర్వాత ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటారు. వివిధ జిల్లాల నుంచి తీసుకొచ్చిన బ్యాలెట్ బాక్సులను జడ్పీ సీఈవో కె.సుబ్బారావు పర్యవేక్షణలో ఖాళీ బాక్సులను ఆయా జిల్లాలకు తరలింపు ప్రక్రియను అధికారులు పూర్తి చేశారు.

నేడు గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు

ఏలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గీత కార్మికుల ఉపకులాల మద్యం దుకాణాల లైసెన్సులకు దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 6న ఉదయం 10 గంట లకు కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో కలెక్టర్ వెట్రిసెల్వి ఆధ్వర్యంలో లాటరీ ద్వారా షాపులను కేటాయించనున్నట్టు ఏలూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆనాల ఆవులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 10న జరగాల్సిన షాపుల కేటా యింపును ఎన్నికల కోడ్ కారణంగా అప్పట్లో తాత్కాలికంగా వాయిదావేశారు. 14 దుకాణాలకు 287 దరఖాస్తులు రాగా, దరఖాస్తు రుసుం కింద రూ.5కోట్ల70 లక్షల ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో లైసెన్సుల జారీకి రంగం సిద్ధం చేశారు. దరఖాస్తుదారులు ఉదయం 8 గంటలకు కలెక్టరేట్‌కు చేరుకోవాలని, ప్రతీ దరఖాస్తు దారుడు ఎంట్రీ పాస్, కుల ధ్రువీకరణ సర్టిఫికెట్, ఆథరైజేషన్ లెటర్ తదితర పత్రాలను తీసుకుని రావాలన్నారు. షాప్ దక్కించుకున్న దరఖాస్తుదారుడు వెంటనే (అదేరోజు) లైసెన్సు రుసుం 5లక్షల41వేల 667 లేదా, రూ.4 లక్షల 58వేల333 మొదటి విడతగా చెల్లించి ప్రొవిజినల్ లైసెన్సు పొందాలన్నారు.

పసిడి..పరుగులు

అందనంత ఎత్తుకు బంగారం ధర

బిస్కెట్ బంగారం గ్రాము రూ.8,900


అర్నమెంట్ రూ.8,170



నరసాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): బంగారం ధర అందనంత ఎత్తుకు దూసుకుపోతోంది. రోజురోజుకు కొత్త రికార్డులను నమోదు చేస్తోంది. బుధవారం గ్రాము బిస్కెట్ బంగారం ధర రూ.8,900 పలికింది. అదే ఆర్నమెంట్ గ్రాము రూ.8,170 చేరింది. ఈ లెక్కన పదిగ్రాముల బిస్కెట్ బంగారం రూ.89 వేలు పలకగా ఆర్నమెంట్ రూ.81,700లకు చేరింది. ధర ఇదే విధంగా పెరిగితే ఈఏడాది చివరినాటికి గ్రాము బంగారం రూ.10 వేలకు చేరుతుందన్న ఊహాగానాలు మార్కెట్‌లో షికారు చేస్తున్నాయి. ఇప్పటికే పెరిగిన ధరలను చూసి సామాన్య, మధ్యతరగతి ప్రజలు జ్యూయలరీ వైపు కన్నెత్తి చూడలేని పరిస్థితి నెలకొంది. భవిష్యత్‌లో గ్రాము బంగారం కొనాలంటే రూ10 వేలు చేతిలో ఉండాల్సిందే. మరోవైపు పెరిగిన ధరతో మదుపుదారుల్లో జోష్ నెలకొంది. గతేడాది వరలక్ష్మీ వ్రతం నాటికి గ్రాము బంగారం రూ.6,300 ఉంది. కేవలం ఆరు నెలల్లో ఈ ధర గ్రాముకు రూ.1900 చొప్పున పెరిగింది. ఈ లెక్కన పది గ్రాముల బిస్కెట్ ధర కొన్నవారికి దాదాపు రూ1.90 లక్షలు లాభాన్ని చవిచూశారు. అలాగే గత ఐదేళ్ల నుంచి బంగారం కొనుగోలు చేసుకున్న వినియోగదారులు కూడా మంచి లాభాలు చూశారు.

అమెరికా ఎన్నికల తరువాతే..

గతేడాది చివరివరకు బంగారం ధర నిలకడగానే కొనసాగుతూ వచ్చింది. అమెరికా అధ్యక్షుడుగా ట్రంప్ ఎన్నికైన దగ్గర నుంచి పరిణామాలు మారిపోయాయి. ట్రంప్ నోట ట్యాక్స్‌లు మాట రావడంతో అంతర్జాతీయంగా ట్రేడ్‌వార్ నెలకొన్నట్లయింది. దీంతో షేర్ మార్కెట్లు పతనమవుతూ వచ్చాయి. ఈ క్రమంలో చాలామంది మదుపుదారులు బంగారంపై పెట్టుబడులు పెట్టారు. ఇది కూడా ధర పెరుగుదలకు కారణమైంది. మరోవైపు డాలర్ పెరుగుదల, క్రూడ్ ధరలు, ఉక్రెయిన్, రష్యాల మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితులు కూడా బంగారం పెరుగుదలకు ఒక కారణమని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. మరోవైపు పసిడి ధర పెరుగుతుండటంతో ఆ ప్రభావం జిల్లాలో బులియన్ మార్కెట్‌పై పడింది.నిత్యం రూ.5 నుంచి రూ.10 కోట్ల వ్యాపారం జిల్లాలో సాగేది. అదే పండుగలు, వివాహాలు ఉంటే రెట్టింపు వ్యాపారం ఉంటుంది. ధర ఒక్కసారిగా భారీగా పెరగడంతో కస్టమర్లు బంగారం కొనేందుకు ఆసక్తి చూపించడం లేదు. రానున్న రోజుల్లో ధర తగ్గుతుందన్న ధీమాతో ఉన్నారు. ఈ కారణంగా వ్యాపారాలు తగ్గాయని జిల్లా బులియన్ వర్తకులు చెపుతున్నారు. జిల్లాలో అత్యధికంగా నరసాపురం, భీమవరంలో జ్యూయలరీ షాపులు ఉన్నాయి. ధర పెరుగుదలతో షాపులు వెలవెలబోతున్నాయి.





ప్రజలకు చికెన్, గుడ్డు ఆహార పదార్థాలు వడ్డిస్తున్న కలెక్టరు నాగరాణి, ఎమ్మెల్యే ఆరిమిల్లి

నిర్భయంగా తినండి

కలెక్టర్ చదలవాడ నాగరాణి

తణుకులో మెగా చికెన్ మేళా

తణుకు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రజలు ఎలాంటి అపోహలు లేకుండా ఉడికించిన గుడ్లు, చికెన్ నిర్భయంగా తినవచ్చని పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. బుధవారం సాయంత్రం నెక్ కల్యాణ మండపం నందు జిల్లా పౌల్ట్రీ ఫెడరేషన్, నెక్ కోళ్ళ రైతులు సంక్షేమ సంఘం మెగా చికెన్, గుడ్లు మేళా నిర్వహించారు. గుడ్లు,చికెన్‌తో చేసిన పలు ఆహార పదార్థాలను స్వయంగా వడ్డిం చారు.కలెక్టరు మాట్లాడుతూ ప్రభుత్వ స్కూలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు పౌష్టికాహారంగా గుడ్లు అంది స్తున్నామన్నారు. ప్రజలు ఎలాంటి భయాందోళన చెందవలసిన అవసరం లేదన్నారు. నాలుగు వారాలుగా పౌల్ట్రీ రైతులు ఇబ్బందులు పడుతున్నారని వారి సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని వివరించారు. ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 300 మంది పౌల్ట్రీ రైతులు ఉన్నారని వైరస్ కారణంగా చాలామంది రైతులు నష్టపోయారన్నారు. నష్టపోయిన రైతుల రుణాలు రీషెడ్యూల్ చేసేందుకు ప్రభుత్వంతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ జిల్లాలోని వేల్పూరు కృష్ణా నందం కోళ్లఫారం నుంచి ఒక కిలోమీటరు పరిధిలో పెదతాడేపల్లి రామలక్ష్మి ఫారం నుంచి ఒక మీటరు పరిధిలో మినహా జిల్లా అంతటా గుడ్లు, చికెన్ తినవచ్చన్నారు. చికెన్ మేళా సూపర్ సక్సెస్ అయిందని పౌల్ట్రీ ఫెడరేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. పదివేల మందికి సరిపడే విధంగా చికెన్, గుడ్లతో తయారు చేసిన పలు ఆహార పదార్థాలు అందజేశారు. ఏపీ పౌల్ట్రీ ఫెడరేషన్ ఛైర్మన్ కోమాట్లపల్లి వెంకట సుబ్బారావు, నెక్ ఛైర్మన్ మల్లిన శ్రీనివాసు, జి.గంగాధరరావు, గన్నమని సుబ్రహ్మణ్యం, ఆర్డీవో ఖతీబ్ కౌసర్, డిప్యూటీ డైరెక్టర్లు జావర్ హుస్సేన్, తహసీల్దార్ అశోక్ వర్మ, కమిషనర్ రామ్‌కుమార్, ఎంపీడీవో జయసాగర్, పౌల్ట్రీ రైతులు పాల్గొన్నారు.

మార్చిలోనే మంటలు !

పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

ఏలూరులో 39.. భీమవరంలో 38 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదు

ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి

భానుడి ప్రతాపం మొదలైంది. మార్చినెల మొదటి వారంలోనే ఉష్ణోగ్రతలు తారస్థాయికి చేరాయి. ఇప్పుడే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో ఎండలు ఏ విధంగా ఉంటాయోనన్న ఆందోళన కనిపిస్తోంది. ఏలూరులో అత్యధికంగా బుధవారం 39 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు కాగా భీమవరంలో 38 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ దెబ్బకు మధ్యాహ్నం రహదారులు నిర్మానుష్యంగా మారాయి..

ఏలూరుసిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం, భీమడోలు, పెదవేగి, చింతలపూడి, ద్వారకాతిరుమల, పెదపాడు, నూజివీడు, కొయ్యల గూడెం, బుట్టాయిగూడెం, పోలవరం తదితర ప్రాంతాల్లో బుధవారం 39 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఉదయం నుంచి వేడి గాలుల ప్రభావం ఎక్కువగా కనిపించింది. మధ్యాహ్నం 3 గంటలకు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో 38 నుంచి 39 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.ఏప్రిల్, మేనెలల్లో ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉంటాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. వేసవికాలంలో ఈ ఉష్ణోగ్రతలను తట్టుకోవటానికి ముందస్తు చర్యలు చేపట్టాలని కూడా పేర్కొంది. ముఖ్యంగా వ్యవసాయ కూలీలు, ఉపాధి కూలీలు తగిన జాగ్రత్తలు తీసుకుని పనులకు వెళ్లాలని సూచించింది. ఇక బుధవారం నాటి పరిస్థితులు పరిశీలిస్తే మధ్యాహ్నం సమయంలో ఏలూరులో రహదారులన్నీ నిర్మాణుష్యంగా కనిపించాయి. రాత్రి ఉష్ణోగ్రతలు మాత్రం 20 నుంచి 21 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోద వుతు న్నాయి. ఎండ దెబ్బకు ప్రధాన పట్టణాల్లో మధ్యాహ్నం సమయంలో ప్రజలు రహదారులపై అంతంత మాత్రంగానే సంచ రించారు. కొబ్బరిబొండాలు, జ్యూస్‌లు, లస్సీ, మజ్జిగ, షోడా, కూల్ డ్రింక్స్ దుకాణాలు బిజీగా కనిపిస్తున్నాయి. ఎండవేడిమి తట్టుకోలేక ప్రజలు అల్లాడిపోతున్నారు. ఒక పక్క విద్యుత్ అంతరాయాలు, మరోపక్క ఎండ తీవ్రత పెరిగి పోవటంతో రాత్రి సమయాల్లో ఉక్కబోత భరించలేక ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. గత మూడు రోజుల్లో జిల్లాలో పగటి పూట ఉష్ణోగ్రతలు 37 డిగ్రీల నుంచి 38 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకు నమోదు కాగా బుధవారం 39 డిగ్రీల సెంటీగ్రేడ్‌కు చేరింది. ఎండల తీవ్రత వల్ల ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారు.



మండుటెండలో రిక్షా కార్మికుని బతుకు వేట



ఎండ తీవ్రతతో ఖాళీగా ఉన్న పెనుగొండ రహదారి

వారం రోజులుగా ఎండ తీవ్రత

పెనుగొండ : వేసవి రాక ముందే పెనుగొండ మండలంలో ఒక్కసారిగా ఎండ పెరిగింది. గడిచిన గత వారం రోజులుగా రోజు రోజుకు భానుడు భగభగమంటున్నాడు. ఫిబ్రవరి 2వ వారం నుంచే ఎండలు తీవ్రత ప్రారంభమైంది. రాత్రి వేళల్లో చలి తీవ్రత ఉంటున్నది. ఎండలకు జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

వేసవి గట్టెక్కేదెలా.. ?

ఏలూరు రూరల్ : వేసవి రానేవచ్చింది ఎండలు మండుతున్నాయి. వేడిగాలులతో పాటు మధ్యాహ్నం సమయంలో ఉక్క పోత ప్రజలను ఇబ్బంది పెడుతోంది. ఎండ, వేడి ఉక్కపోతను తట్టుకునేందుకు ప్రజలు ప్రత్యామ్నాయ మార్గాలకు సిద్ధ పడుతు న్నారు. ఇంట్లో కూలర్, ఏసీలకు పని కల్పిస్తున్నారు. ఫ్యాన్ గాలి ఏ మాత్రం వేడినుంచి ఉపశమనం ఇవ్వకపోవడంతో కాస్తంత స్థోమత ఉన్నవారు కూలర్లు కొనుగోలు చేస్తున్నారు. డబ్బున్నవారు ఏసీలు కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో ఎలక్ట్రానిక్ దుకాణాల్లో సందడి నెలకొంది. గతంలో సీలింగ్ ఫ్యాన్‌కు గిరాకీ ఉండేది. ఇప్పుడు కూలర్లు, ఏసీల వైపు చూస్తున్నారు.



ఏలూరులోని ఒక షాపులో సిద్ధంగా ఉంచిన ఎయిర్ కూలర్లు



ఉపాధి కూలీలకు వేసవి భృతి లేనట్లేనా..?

విడుదల కాని మార్గదర్శకాలు

పని ప్రాంతాలలో ఎండ నుంచి ఉపశమనానికి చర్యలు

జోరుగా పనులు.. పెరిగిన కూలీల హాజరు శాతం

ఏలూరుసిటీ, మార్చి 5 (ఆంధ్రజ్యోతి):వేసవి కాలం వచ్చిందంటే ఉపాధి పనులు చేయటానికి కూలీలు నానా అవస్థలు పడాల్సి వచ్చేది. అందువల్లే వేసవి కాలం నాలుగు నెలల్లో (మార్చి, ఏప్రిల్, మే, జూన్) ఉపాధి కూలీలకు పనుల పరిమాణాన్ని తగ్గించి సాధారంగానే వేతనం చెల్లించేవారు. అయితే ఈసారి ఉపాధి కూలీలకు వేసవి భృతిపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు జారీ కాలేదు. ఉపాధి కూలీలకు చెల్లించే రోజువారీ వేతనం రూ.300 లకు పెంచడంతో వేసవి భృతి కూడా అందులోనే ఉంటుందని చెబుతున్నారు. జిల్లాలో మొత్తం 3.75 లక్షల జాబ్‌కార్డులుండగా 6.75 లక్షల మంది కూలీలున్నారు. ఇందులో పనులకు హాజరయ్యే కూలీలకు సంబంధించి 3.19 లక్షలు యాక్టివ్ జాబ్‌కార్డులున్నాయి. మొత్తం 5.53 లక్షల మంది కూలీలు పనులకు హాజరవు తున్నారు. వేసవిలో ఉపాధి కూలీలు పనులు నిర్వహించడం కష్టతరంగా ఉంటుందని భావించిన ప్రభుత్వాలు మార్చి నెలలో 25 శాతం, ఏప్రిల్‌లో 30 శాతం, మేలో 30 శాతం, జూన్ నెలలో 20 శాతం వరకు పనుల పరిమాణం తగ్గించి నూరుశాతం పనికి వేతనం అందించే వారు. ఎండలు ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి కూలీలకు మంచినీటి సౌకర్యం, పని చేసే ప్రదేశాల్లో టెంట్‌లు ఏర్పాటు, మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సహకారంతో మెడికల్‌కిట్‌లు అందించేవారు.

జోరుగా సాగుతున్న ఉపాధి పనులు

ఉపాధి పనులు జిల్లాలో జోరుగా సాగుతున్నాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది కూలీల హాజరుశాతం కూడా బాగా పెరిగింది. గతంలో ఈ సమయంలో రోజువారీ 30 నుంచి 35 వేల మంది కూలీలు పనులకు హాజరయ్యేవారు. ఇప్పుడు రోజువారీ ఉపాధి పనులకు 60వేల మంది వరకు హాజరవుతున్నారని డ్వామా శాఖ నివేదికల ద్వారా తెలు స్తోంది. చెరువుల పూడికతీత పనులు, పంటచేలల్లో కంద కాలు ఏర్పాటు, ఫామ్ పాండ్స్, గట్టు వెంబడి, ప్రభుత్వ కార్యాలయాల్లో మొక్కలు పెంపకం వంటి పనులు జరుగుతున్నాయి.

మేట్‌లకు ప్రత్యేక ప్రోత్సాహకాలు

జాతీయ ఉపాధి హామీ పథకంలో మేట్స్‌కు ప్రత్యేకంగా ప్రోత్సాహకాలు కల్పిస్తున్నారు. ఒక్కొక్క మేట్ 50 మంది కూలీలను పనులకు తీసుకు వస్తుంటారు. అందువల్లే ప్రతి మేట్‌కు వారు తీసుకువచ్చే ప్రతి కూలీకి సంబంధించి రూ. 1.50 (రూపాయిన్నర)వరకు అదనపువేతనం అందిస్తారు. ఒకవేళ మేట్ 100 రోజులు పనిదినాలు పూర్తి చేసుకుంటే అప్పటినుంచి మేట్‌లు తీసుకువచ్చే ఒక్కొక్క కూలీకి సంబం ధించి 3 రూపాయిలు వరకు మేట్‌కు వేతనంతో అందిస్తారు. ఉపాధి కూలీ లను పనులకు తీసుకురావటానికి మేట్‌లకు ప్రోత్సాహకాలు అందించాలని నిర్ణయించారు.

పశు బీమా..రైతుకు ధీమా


పశువులకు బీమా పథకం పునరుద్ధరణ

30 శాతం రైతు, 70 శాతం ప్రభుత్వం చెల్లింపు

గ్రామాల్లో పాడి రైతులకు అవగాహన

పశువులకు బీమా పథకాన్ని కూటమి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకువచ్చింది. కొంతకాలం పాటు నిలిపివేయగా ఈ ఏడాది నుంచి పునరుద్ధరించింది. ఏలూరు జిల్లాలో 5 లక్షలకు పైగా గేదెలు, 2.5 లక్షలుకు పైగా ఆవులు, 9 లక్షలకు పైగా గొర్రెలు, మేకలు, 1.30 కోట్లు కోళ్ళు ఉన్నాయి. పశ్చిమ గోదా వరి జిల్లాలో 45,539 ఆవులు, 1,78,137 గేదెలు ఉన్నట్టు పశు సంవర్ధక శాఖ లెక్కల ద్వారా తెలుస్తోంది. ఆయా జీవాల రైతులకు ఇప్పటికే గ్రామాల్లో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

కైకలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పాడి రైతులకు ప్రయోజనకరంగా నిలిచే పశువుల బీమా పథకాన్ని గత వైసీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. 2023 వరకు ఎలాంటి పథకాన్ని పశువులకు అందించకుండా వదిలివేసింది. అక్కడి నుంచి ప్రతీ రైతు తన పశువుకు 30 శాతం బీమా చెల్లిస్తే ప్రభుత్వం 70 శాతం చెల్లించేలా వైసీపీ ప్రభుత్వం తీసుకు వచ్చింది. అయితే దీనిలో కొన్ని ఇబ్బందులు కలగడంతో తాత్కాలికంగా ప్రస్తుత కూటమి ప్రభుత్వం నిలిపుదల చేసింది. రానున్న ఆర్థిక సంవత్సరం 2025-26 నుంచి పశువులకు బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. 2014 నుంచి 2019 వరకు అప్పటి టీడీపీ ప్రభుత్వంలో పశువులు మృతి చెందితే రూ.30 వేలు నష్టపరిహారాన్ని నేరుగా అందజేసేవారు. ప్రస్తుతం వ్యవసాయ అనుబంధ రంగాలతో పాటు రైతులు ఎక్కువగా పాడిపశువుల పోషణపై ఆధారపడి ఉన్నారు. పాడిపరిశ్రమను కాపా డేందుకు ప్రభుత్వం ఈ పథకాన్ని తీసుకువచ్చింది. అనేకమంది రైతులు ఇటీవల గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలను మేపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. రైతులకు ఎంతో ప్రధానమైన పశువులు వ్యాధులకు గురై మృత్యువాత పడుతుంటాయి. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఈ పరిస్థితిని అధిగమించడానికి కూటమి ప్రభుత్వం బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. అలాగే తుఫాన్లు, వరదలు, పిడుగులు, భూకంపాలు వంటి ప్రకృతి విపత్తులు, విద్యుదాఘాతం, వాహనాలు ఢీకొనడం వంటి ప్రమాదాలు, రకాల వ్యాధుల బారినపడిన ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు చనిపోతే సంబంధిత బీమా కంపెనీ నుంచి నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకుం టుంది. దీంతో రైతులు తమ పశువులకు బీమా చేయించడం మొదలుపెట్టారు.ఇప్పటికే గ్రామాల్లో రైతులు తమ వాటాగా 30 శాతం చెల్లిస్తున్నారు. మరో 70 శాతం రాష్ట్ర ప్రభుత్వం చెల్లించనుంది.



• ప్రతీ రైతు వినియోగించుకోవాలి

ఈ ఆర్థిక సంవత్సరం నుంచి ప్రభుత్వం పశువులకు బీమా పథకాన్ని తీసుకువచ్చింది. ప్రతీ రైతు బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతాం. ఇప్పటికే కొంతమంది రైతులు బీమా చెల్లింపులు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కువ జీవాలకు బీమా చేసుకునే విధంగా చర్యలు చేపడతాం.

-జిల్లా పశువైద్యాధికారి, గోవిందరాజులు

మూగజీవాలకు మంచి రోజులు

ఉపాధి హామీలో గోకులాల నిర్మాణం

కూటమి ప్రభుత్వం చొరవతో పశువులకు గూడు

ఏలూరు రూరల్, మార్చి 5 (ఆంధ్ర జ్యోతి):పశుపోషణ భారంగా మారిన రైతాంగాన్ని ఆదుకునే దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. అధికారంలోకి వచ్చిన వెంటనే పశువుల కోసం గోకులాల షెడ్లు నిర్మాణానికి అనుమతులు మంజూరు చేసింది. ఉపాధిహామీ పథకంలో వీటి నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించింది. వ్యవసాయంలో పశువులకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అయితే వీటిని సంరక్షించుకోవడానికి రైతులకు భారంగా మారింది. రసాయన ఎరువులు వాడకం పెరగడంతో పశువులను, రైతులు విక్రయిస్తున్నారు. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో పశుగణం తగ్గిపోతోంది. సేంద్రియ ఎరువు గగనమైంది. దీన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం పశుగణను పెంచేందుకు పశువులను కట్టి మేపుకునేందుకు వీలుగా గోకులం షెడ్లు మంజూరు చేస్తోంది. ఉపాధిహామీ పథకంలో వీటి నిర్మాణాలు చేపట్టేందుకు వీలుగా మార్గదర్శకాలు విడుదల చేసింది. గోకులం షెడ్ల నిర్మాణంలో ప్రభుత్వం 90 శాతం భరిస్తుండగా, రైతు పదిశాతం భరించాలి. కూటమి ప్రభుత్వం ఆదేశంతో తొలివిడతలో ఏలూరు జిల్లాలో 713 యూనిట్లు మంజూరు కాగా, 546 షెడ్లు పూర్తి అయ్యాయి. పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి 779 షెడ్లు మంజూరవగా 450 పూర్తయ్యాయి.

ప్రతీ పంచాయతీకి రెండు ..

ప్రతి మండలంలో ప్రతి పంచాయతీకి రెండు గోకులాలు చొప్పున మంజూరు చేసింది. ఆరు పశువులు ఉంటే రూ.2.3 లక్షలు, నాలుగు ఉంటే రూ.1.6 లక్షలు, రెండు ఉంటే రూ.లక్షతో షెడ్లు నిర్మిస్తున్నారు. అలాగే కోళ్ళు, మేకలు పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. వీటికి 70 శాతం ప్రభుత్వం, 30 శాతం రైతు భరించేలా మార్గదర్శకాలు విడుదల చేసింది. ఇప్పటికే సగానికి పైగా గోకులం షెడ్లు పూర్తి అయ్యాయి. వివిధ దశల్లో ఉన్న గోకులం షెడ్లు ఏప్రిల్ నెలాఖరు నాటికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. క్లస్టర్ పరిధిలో మంజూరైన గోకులం షెడ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయించేలా రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మిగతావి పూర్తి అయ్యేందుకు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం మంజూరు చేసిన షెడ్ల నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నాయి. రైతులు కూటమి ప్రభుత్వం తీసుకున్న చొరవతో పాడి రైతులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.



ఏలూరు మండలం చాటపర్రులో పూర్తయిన మినీగోకులం షెడ్డు



ఉండి మండలం మహదేవపట్నం సర్పంచ్ వెంకట సుబ్బలక్ష్మీ


ఢిల్లీ వర్క్‌షాపులో మహదేవపట్నం సర్పంచ్

ఉండి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని న్యూఢిల్లీలో నిర్వహించిన అవగాహన సదస్సుకు ఉండి మండలం మహదేవపట్నం గ్రామ సర్పంచ్ వనిమా వెంకట సుబ్బలక్ష్మీ హాజరై మాట్లాడారు. పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ నిర్వహించే వర్క్‌షాప్‌కు పశ్చిమగోదావరి జిల్లా నుంచి తాను ఎంపికైనట్లు తెలిపారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి, చేపట్టన్ను పనుల గురించి వివరించినట్లు తెలిపారు.

అమరవరం అటవీ రేంజ్‌లో తనిఖీలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కుక్కునూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కుక్కు నూరు మండలంలో అడవులను ఇష్టారాజ్యంగా నరికివేస్తున్నారని బుధ వారం 'వృక్షవిలాపం' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనంపై జిల్లా అధికారులు స్పందించారు. రాజమండ్రి స్క్వాడ్ డీఎఫ్‌వో, ఏలూరు జిల్లా డీఎఫ్‌వోతో పాటు సిబ్బంది పర్యవేక్షణ జరిపారు. బర్లమడుగు అటవీ ప్రాంతంలో జామాయిల్ చెట్టు నరికివేత, మారుజాతికలప తరలింపు, ముత్యాలమ్మ పాడులో టేకు ప్లాంటేషన్‌లో కనుమరుగవుతున్న చెట్లు, అలాగే అక్రమంగా రిజర్వ్ ఫారెస్ట్‌లో నర్సరీల ఏర్పాటు తదితర వాటిపై పరిశీలన జరిపారు. స్థానిక అటవీ సిబ్బందికి సూచనలు జారీ చేశారు. మారుమూల అటవీ ప్రాంతంలో కూడా నిఘా పెంచి అడవులు నరికివేయకుండా చూడాలని జిల్లా సూచించారు.



త్యాగరాజ ఆరాధనోత్సవాలు

తాడేపల్లిగూడెం రూరల్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం టీవీఆర్ కళాకేంద్రం వద్ద నిర్వహిస్తున్న త్యాగరాజ ఆరాధనోత్సవాలు బుధవారం నాలుగోరోజు కొనసాగాయి. కళాకేంద్రం వ్యవస్థాపకులు బుద్దాల వెంకట రామారావు ఆధ్వర్యంలో విజవాడకు చెందిన తుషార పూర్ణవలి గాత్రకచేరి చేయగా వయోలిన్ కూరపాటి సుబ్రహ్మణ్యరాజు, పలివెల విద్యాసాగర్ మృదంగ ప్రదర్శన ఆకట్టుకుంది.

పోలవరం ప్రాజెక్టులో మట్టి, రాతి నాణ్యత పరిశీలన


మట్టి నమూనా పరిశీలిస్తున్న నిపుణుల బృందం

పోలవరం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు మట్టి, రాతి నాణ్యత పరిశీలన బృందం (సీఎస్ఎంఆర్ఎస్) సెంట్రల్ సాయిల్ అండ్ రాక్ సర్వే, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్ (ఎన్ఐఆర్ఎం) బృందం బుధవారం పరిశీలించింది. ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాంలో వినియోగించనున్న మట్టి రాతి నాణ్యత పరిశీలన కార్యక్రమం, డయాఫ్రంవాల్ కాంక్రీట్ సామర్థ్య పరీక్షలు ఈ బృందం రెండు రోజులుగా నిర్వహించింది. కొన్ని రోజుల క్రితం చేగొండపల్లి ప్రాంతంలో బ్లాండింగ్ ప్లాంట్ వద్ద రాతి నాణ్యత కోసం నమూనాలను సేకరించారు. రాతి నమూనాల నాణ్యతా ప్రమాణాలు, డయాఫ్రం వాల్ కాంక్రీట్ నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలను కేంద్రానికి పంపి స్పష్టమైన ఆదేశాలు తీసుకోవలసి ఉంటుంది. రెండు రెండు రోజులుగా ఎర్త్ కం రాక్‌ఫిల్ డ్యాంలో వినియోగించనున్న మట్టి నాణ్యత ఇతర అంశాలపై ఈ బృందం పోలవరం ప్రాజెక్టులో పలుచోట్ల మట్టి నమూనా సేకరణ చేపట్టారు. అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా గొందూరు తదితర ప్రాంతాలను బృందం పరిశీలించింది. ఈ కార్యక్రమంలో సీఎస్ఎంఆర్ఎస్ కాంక్రీట్ నాణ్యత నిపుణులు లలిత్ కుమార్ సోలంకి, రాతి నాణ్యత నిపుణులు వినోద్ గుప్తా, డీఈ నిర్మల క్వాలిటీ కంట్రోల్ డీఈ శివప్రసాద్, డీఈఈ అనిల్ పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు మృతి


పాడె మోస్తున్న ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ (ఇన్‌సెట్) చిట్టూరి వెంకటేశ్వరరావు (ఫైల్)

తణుకు, మార్చి5(ఆంధ్రజ్యోతి): తణుకు మాజీ ఎమ్మెల్యే చిట్టూరి వెంకటేశ్వరరావు (93) బుధవారం ఆయన స్వగృహంలో మృతి చెందారు. కొద్ది రోజులుగా అస్వస్థతతో ఉన్న వెంకటేశ్వరరావు తణుకులోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనకు భార్య శ్రీలక్ష్మి, కుమారులు రాజేంద్ర, పాండు రంగారావు, బలరామ్, కుమార్తెలు కలగర పద్మ, కడవ రాణి ఉన్నారు. సాయంత్రం కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అంత్యక్రియలు నిర్వహించారు. వెంకటేశ్వరరావు మృతదేహం వద్ద ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ నివాళులర్పించారు. అనంతరం పాడె మోశారు.

ఇంద్రయ్య కాలేజీ స్థాపన

తండ్రి జ్ఞాపకార్థం చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ కళాశాలను చిట్టూరి వెంకటేశ్వరరావు 1968లో స్థాపించారు. జూనియర్, డిగ్రీ, కళాశాలలు స్థాపించి ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దారు. 1983 ఎన్నికల్లో గెలుపొంది అతి తక్కువ కాలం ఎమ్మెల్యేగా పని చేసారు. లయన్స్ ద్వారా సుదీర్ఘకాలం సేవలందించారు. ఆయన సోదరుడు చిట్టూరి బాపినీడు కూడా ఎమ్మెల్యేగా పనిచేశారు.

మాధవాయిపాలెం రేవు పాటకు కసరత్తు



నరసాపురం, మార్చి5 (ఆంధ్రజ్యోతి): మాధవాయిపాలెం రేవు పాటకు రంగం సిద్ధమైంది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రేవు నిర్వహణ వేలం పాటకు గత నెలలో నోటిఫికేషన్ జారీ చేయాల్సి ఉంది. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కారణంగా నిలిపివేశారు. శుక్రవారంతో కోడ్ ముగియనుంది. సోమవారం లేదా మంగళవారం నోటిఫికేషన్ చేస్తామని ఎంపీడీవో రామకృష్ణంరాజు చెప్పారు. ప్రారంభ ధర రూ. 3.25 కోట్లు నిర్ణయించామన్నారు. జిల్లా అధికారుల నుంచి ఆమోదం కూడా వచ్చిందన్నారు. ఈనెలాఖరు నాటికి పాట ప్రక్రియ పూర్తి చేసి కొత్త ఆర్థిక సంవత్సరంలో పాడదారుకు నిర్వహణ అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గతంలో మాదిరి సిగ్నేట్, బహిరంగ పద్ధతిలో వేలం ఉంటుందన్నారు. నోటిఫికేషన్‌లో అన్ని వివరాలను వెల్లడిస్తామన్నారు.

కేంద్రం ఒత్తిడికి తలొగ్గిన రాష్ట్ర ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న మంతెన సీతారాం

భీమవరం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు విద్యుత్ స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ నేడు కేంద్రం ఒత్తిడికి తలొగ్గి అమలు చేయడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర నాయకుడు మంతెన సీతారాం విమర్శించారు. ఆదర్శ కుటీరం లో జరిగిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశం బుధవారం జరిగింది. స్మార్ట్ మీటర్లతో రీడింగ్ తీస్తున్న 1500 మంది ఉపాధి పోతుందన్నారు. ఎన్నికల ముందు సూపర్ సిక్స్ పథకాలతో ఊదరగొట్టిన కూటమి ప్రభుత్వం నేడు బజానా ఖాళీ అయిందని, దాపాడాలుగా అమలు చేస్తామని చెప్పడం ప్రజలను మోసగించడమేనన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వీ గోపాలన్ మాట్లాడుతూ బడ్జెట్ వ్యవసాయ రంగానికి ఉపాధి రంగానికి నిధులు పెంచకుండా కార్పొరేట్లకు ఉపయోగపడేలా ఉందన్నారు. సీపీఎం జిల్లా నాయకులు బలరాం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చి 9 నెలల కాలంలో ఇచ్చిన హామీలు అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. బడ్జెట్ అంకెలు గారడీ తప్ప మరోటి కాదన్నారు. సమావేశంలో కె.గోపాలన్, కె.ఏడ్చిరాజు, పీవీప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ స్థలం భార్యకు బహుమతి!

- రూ.కోటి విలువైన భూమి కబ్జా
- నారాయణపురంలో యువ నాయకుడి దందా

ఉంగుటూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఉంగుటూరు మండలం నారాయణపురంలో జాతీయ రహదారి పక్కన స్థలాల విలువ అమాంతం పెరిగిపోయింది. స్థానిక నాయకుడు ఒకరు పంచాయతీ స్థలాన్ని తన భార్యకు బహుమతిగా ఇచ్చేశారు. తన పుట్టినరోజు సందర్భంగా వచ్చిందంటూ సుమారు 7 సెంట్ల భూమిని తన భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించడం గమనార్హం. ఆవిర కుటీరాలు భార్య లేదా తనకు నచ్చిన వారికి బహుమతిగా విలువైన వస్తువులు ఇవ్వడం సహజం. నారాయణపురం గ్రామానికి చెందిన యువ నాయకుడు తనకు ఏమాత్రం సంబంధం లేని భూమిని భార్యకు బహుమతిగా ఇచ్చాడు. పంచాయతీ భూమి కబ్జా చేసి ఆమె పేరిట రిజిస్టర్ చేయించేశారు. ప్రధాన రహదారి పక్కన (జాతీయ రహదారి 216 ఏ)లో ఉన్న పంచాయతీ స్థలం 6 సెంట్ల భూమితో పాటు మరి కొంత భూమిని కలిపి 291 గజాలను తన భార్యకు బహుమతిగా ఇస్తున్నట్టు తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో గత ఏడాది డిసెంబరు 26న రిజిస్ట్రేషన్ చేయించారు. ఈ విషయం ఎంపీడీవో జి.రాజ్ మనోజ్ దృష్టికి రావడంతో సంబంధిత పంచాయతీ కార్యదర్శి సతీల విజయ్ కుమార్‌ను విచారణ చేయాలని ఆదేశించారు. దీనితో కబ్జా బాగోతం బయట పడింది. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం అన్యాక్రాంతమైన భూమిపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా జరిగిన భూమి రిజిస్ట్రేషన్ విషయమై 90 రోజులలోపు అభ్యంతరం వ్యక్తం చేసే అధికారం సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఉందని ఎంపీడీవో తెలిపారు. దీనిపై తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ఫిర్యాదు చేస్తామని రాజ్ మనోజ్ తెలిపారు.

బహుమతి.. తర్వాత తనఖా..!

భార్యకు బహుమతిగా ఇచ్చిన భూమిని తనఖా కూడా పెట్టేశారు. భార్య పేరిట రిజిస్ట్రేషన్ చేయించిన భూమి ఆ నాయకుడు మరొకరికి తనఖా రిజిస్టర్ చేయించి కొనమెరుపు. ఈ భూమి రిజిస్ట్రేషన్ వ్యవహారంలో స్థానిక నాయకులతో పాటు తాడేపల్లిగూడెం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది హస్తం ఉన్నట్టు విమర్శలు.

చేబ్రోలు పోలీసులకు ఫిర్యాదు

భూమి రిజిస్ట్రేషన్‌పై నిడమర్రు సీఐ, చేబ్రోలు ఎస్ఐకు ఫిర్యాదు చేశామని, బుధవారం కబ్జా నాయకుడిని పిలిచి విచారణ జరుపుతున్నారని కార్యదర్శి విజయ్‌కుమార్ తెలిపారు. పంచాయతీ స్థలాల పరిరక్షణకు సర్పంచ్ దిద్ద అలకనంద సహకారంతో ఆయా స్థలాల్లో రక్షణ బోర్డులు ఏర్పాటు చేస్తామని తెలిపారు.

కాసుల పంట పొగాకు

ఏజెన్సీ, మెట్ట ప్రాంతాల్లో రెండేళ్లుగా పొగాకు రైతులకు ఆశలు పండుతున్నాయి. వర్జీనియా సాగు కాసులు కురిపిస్తోంది. ఎప్పుడూ నష్టాలు, అప్పుల్లో కూరుకుపోయే రైతులు గత సీజన్లలో గిట్టుబాటు ధర ఊరటనిచ్చింది. క్రమేపీ వర్జీనియా సాగు విస్తరించింది. ప్రస్తుతం దిగుబడి బాగుందని, ధర పలికితే లాభాలు కళ్ల జూడవచ్చని రైతులు ఆశిస్తున్నారు. అదే సమయంలో పొగాకు బోర్డు ఆంక్షలు విధించే అవకాశం లేకపోలేదు. పొగాకుతో పురుగు మందులు, ఇతర అవశేషాలుంటే ధరలో కోత పడవచ్చని అధికారులు భావిస్తున్నారు.

- మెట్టప్రాంతంలో విస్తరించిన వర్జీనియా సాగు
- 37 మిలియన్ కిలోల ఉత్పత్తి అంచనా
- గత ఏడాది రికార్డు స్థాయి ధర రూ.411
- ఈ ఏడాది కూడా ధరపై రైతుల ఆశాభావం
- 24 నుంచి కొనుగోళ్లు ప్రారంభం


క్యూరింగ్ చేసిన పొగాకును పరిశీలిస్తున్న ఆక్షన్ సూపరింటెండెంట్ సురేంద్రకుమార్

జంగారెడ్డిగూడెం (ఏలూరు) మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ మెట్టప్రాంతాల్లో వర్జీనియా సాగు రైతులకు కాసులు కురిపిస్తోంది. తెగుళ్లు, గిట్టుబాటు కాని ధరలతో ప్రత్యామ్నాయ పంటల వైపు చూస్తున్న రైతులకు రెండేళ్ల నుంచి కాలం కలిసి వచ్చింది. అంతర్జాతీయ మార్కెట్‌లో రెండేళ్లుగా వర్జీనియా పొగాకుకు మంచి డిమాండ్ ఏర్పడింది. గత ఏడాది కిలో పొగాకు రికార్డు ధర రూ.411 పలికింది. రైతులు అప్పుల నుంచి బయటపడ్డారు. అదే ఉత్సాహంతో ఏజెన్సీ మెట్ట ప్రాంతంలో 13,143 హెక్టార్లలో రైతులు పొగాకు సాగు చేశారు. ఈ సీజన్‌లో 37 మిలియన్ కిలోల పొగాకు ఉత్పత్తి అవుతుందని అధికారుల అంచనా. దాదాపు 60 శాతం బ్రైట్ గ్రేడ్ పొగాకు పండడం విశేషం. గత ఏడాది మాదిరి పొగాకు లాభాలబాట పట్టిస్తుందని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు. ఈ నెల 24 నుంచి పొగాకు కొనుగోళ్లు ప్రారంభం కానున్నట్లు జంగారెడ్డిగూడెం పొగాకు వేలం కేంద్రాల అధికారులు బి.శ్రీహరి, జె.సురేంద్రకుమార్ తెలిపారు.

నాణ్యమైన పొగాకు సిద్ధం చేయాలి



జంగారెడ్డిగూడెంలోని 18వ వేలం కేంద్రం పరిధిలో 2500 మంది రైతులు 6275 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. 3050 బ్యారన్లు ఉన్నాయి. 18 మిలియన్ కిలోల పొగాకు పండుతుందని భావిస్తున్నాం. ఈ ఏడాది పండిన పొగాకు గత వరేళ్లలో పండలేదు. రైతులు హీట్, సాఫ్ట్ లేకుండా గ్రేడ్‌ల ఆధారంగా పొగాకును సిద్ధం చేసుకోవాలి. పురుగు మందులు, ఇతర అవశేషాలు లేకుండా ఎరువులకు అనుమతి ఉపయోగించుకోవాలి. క్యూరింగ్ మీటర్లు తప్పనిసరిగా రైతులు ఉపయోగించాలి. ఈ సూచనలు పాటిస్తే మంచి ధర వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

బి.శ్రీహరి, సూపరింటెండెంట్, పొగాకు వేలం కేంద్రం (18)

హైగ్రేడ్ పొగాకు పండింది



వేలం కేంద్రం 32 పరిధిలో 2826 మంది రైతులు 6868.47 హెక్టార్లలో పొగాకు సాగు చేశారు. 3132 బ్యారన్లు ఉన్నాయి. గత ఏడాది 160 రోజుల్లో 15.15 మిలియన్ కిలోల పొగాకు కొనుగోలు చేశాం. ఈ సీజన్‌లో 19 మిలియన్ కిలోల పొగాకు పండవచ్చని అంచనా వేశాం. 60 శాతం హై గ్రేడు పొగాకు పండింది. మీడియం 30 శాతం, లో గ్రేడు 10 శాతం పండవచ్చని భావిస్తున్నాం. తమ వేలం కేంద్రంలో గత ఏడాది సగటు ధర రూ.323 కాగా అధిక ధర రూ.411, అత్యల్ప ధర రూ.100 పలికింది. ఈ సీజన్ కూడా ఆశాజనకంగా ఉండవచ్చు.

జె.సురేంద్రకుమార్, సూపరింటెండెంట్, పొగాకు వేలం కేంద్రం (32)

సైలెన్సర్ వద్దా?



- ఆకతాయిల చిత్రమైన పోకడ
- గుండెలదిరే వింత శబ్దం
- దూసుకుపోతున్న వాహనాలు
- రోడ్లపై ప్రజల బెంబేలు

ద్విచక్ర వాహన కాలుష్యం, శబ్దం నిరోధించే సైలెన్సర్. ఆకతాయిలకు సైలెన్స్ వెలితిగా ఉంది. వాహన సైలెన్సర్ పీకేస్తున్నారు.. అదిరిపోయే సౌండ్‌తో రోడ్లపై రయ్‌మని దూసుకుపోతున్నారు. జిల్లాలో చిత్రమైన చేష్టలు విస్తృతమవుతున్నాయి.

ద్విచక్ర వాహనంపై ఎనిమిదేళ్ల కుమార్తెతో దంపతులు నరసాపురం నుంచి పాలకొల్లు ఆస్పత్రికి బయలుదేరారు. ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌లో జాగ్రత్తగా వెళుతున్నారు. ఇంతలో రాకెట్ వేగం.. పిడుగులాంటి శబ్దంతో ఓ బైక్ పక్కనుంచి దూసుకుపోయింది. కుమార్తెతో పాటు దంపతులు హడలిపోయారు.

చెవులు పగిలేలా బైక్ సౌండ్‌కు రహదారిపై వాహనదారులు ఏం జరిగిందోనని ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. రెప్పపాటులో ఓ బైక్ వింత శబ్దంతో బైక్ దూసుకుపోవడం గుర్తించి అందరూ విస్తుపోయారు.

నరసాపురం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కర్ణకఠోరమైన బైక్ శబ్దాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఇప్పటికే ట్రాఫిక్‌లో వాహనాల శబ్దాలతో కలవరపడుతుంటే ఆకతాయిలు చేష్టలు కంగారు పెడుతున్నాయి. ద్విచక్ర వాహనాల సైలెన్సర్లు తీసేసి చెవులు చిల్లుపడే వీరర శబ్దాలతో హల్‌చల్ చేస్తున్నారు. పోలీసులు, ఆర్టీఏ అధికారులు పూర్తిగా నియంత్రించడం లేదనే విమర్శలు వస్తున్నాయి.

వాహన చట్టాలను ఉల్లంఘిస్తూ..

మోటర్ వాహనాల చట్టం ప్రకారం తయారీ కంపెనీలు ద్విచక్ర వాహనాలకు సైలెన్సర్లు ఏర్పాటు చేస్తారు. ఇంజన్ సామర్థ్యం బట్టి సైలెన్సర్ శబ్దాలు వస్తుంటాయి. 125 సీసీ సామర్థ్యం కలిగిన ఇంజన్‌కు 100 డెసిబెల్స్‌లోపు శబ్దం ఉంటుంది. బుల్లెట్, ఇతర వాహనాలు కూడా ఈ డెసిబెల్స్‌లోపే వాహన శబ్దాలు ఉంటాయి. 125 డెసిబెల్స్ దాటితే చెవిలో నరం దెబ్బతినే ప్రమాదం ఉంది. కొంతమంది వాహన కంపెనీల సైలెన్సర్లను తీసి వింత శబ్దాలతో పరుగులు తీయిస్తున్నారు.

రకరకాల సైలెన్సర్లు

చాలామంది యువత వాహనాలు నడిపేటప్పుడు ఆకతాయిగా వ్యవహరిస్తున్నారు. శబ్దాలు వచ్చే టెయిల్ గన్నర్, పార్ట్ బాటిల్, డబుల్ బేరల్, రెడ్ రన్నర్ వంటి పేర్లతో సైలెన్సర్లు మార్కెట్‌లోకి వచ్చాయి. తుపాకీ శబ్దాలు వచ్చే సైలెన్సర్లను టెయిల్ గన్నర్ అని, సీసాలు పగిలినట్లు వచ్చే పాట్ బాటిల్, ఆడవి పంది అరిచినట్లు శబ్దం వచ్చే వైల్డ్ బోర్ అని పిలుస్తుంటారు. కొందరు సైలెన్సర్ లేకుండా భారీ శబ్దంతో వాహనం నడుపుతున్నారు.

ట్రెండ్.. క్రేజ్..

ట్రెండ్ పేరిట ఆకతాయిలు చిత్రమైన పోకడలతో క్రేజీగా వ్యవహరిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 10లక్షలపైనే ద్విచక్ర వాహనాలు ఉన్నాయి. యువత లక్ష వాహనాలను వాడుతున్నట్లు అధికారుల అంచనా. ప్రధాన రహదారులు, మార్కెట్, వీధులు, స్కూల్, కాలేజీల వద్ద ఆకతాయిలు బైక్‌లపై ఈ వింత శబ్దాలతో ప్రజలను హడలగొడుతున్నారు.

సైలెన్సర్లు లేని వాహనాలపై నిఘా



ఇటీవల కొంత మంది ఆకతాయిలు వాహన చట్టాలను ఉల్లంఘిస్తూ బైక్ రైడింగ్ చేస్తున్నారు. వారికి డ్రైవింగ్ లైసెన్స్ కూడా ఉండడం లేదు. సైలెన్సర్లు తీసివేయడం, శబ్దాలు వచ్చేలా వాహనాలు నడపడం వంటి చర్యలు పెరిగాయి. ఇటువంటి వాహనాలపై నిఘా ఉంచాం. ట్రాఫిక్ రద్దీ సమయాల్లో మఫ్టీలో పోలీసులను పెడుతున్నాం. వాహనాలను పట్టుకుని జరిమానా వేస్తున్నాం. రెండు మూడు సార్లు పట్టుబడితే బైక్‌ను సీజ్ చేస్తున్నాం. నడిపే యువకుడికి కూడా లైసెన్స్ హెల్మెట్, శబ్దాల వల్ల ప్రజలకు కలిగే ఇబ్బందులపై అవగాహన కల్పిస్తున్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రుల్ని పిలిచి కౌన్సెలింగ్ ఇస్తున్నాం.

యాదగిరి, సీఐ, నరసాపురం


అధ్యక్షా..



ప్రత్తిపాడు - బాదంపూడి రహదారి పునర్నిర్మించాలి

అసెంబ్లీలో ఎమ్మెల్యే బొలిశెట్టి

తాడేపల్లిగూడెం అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రాష్ట్రంలో రహదారుల అభివృద్ధి కోసం రూ.8,900 కోట్లు కేటాయించడం అభినందనీయమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. అసెంబ్లీ సమావేశాలలో బుధవారం బొలిశెట్టి మాట్లాడుతూ గత ప్రభుత్వం కనీసం పట్టించుకోకపోవడం వల్ల నియోజకవర్గంలో రహదారులు అధ్వానంగా మారాయన్నారు. ఇప్పటికే గోతులలో పడి అనేకమంది ఆసుపత్రుల పాలై మృత్యువాత పడ్డారన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తరువాత గోతులను పూడ్చడమని అనుకుంటే అది కూడా సరిగా కుదరలేదన్నారు. ప్రత్తిపాడు నుంచి తాడేపల్లిగూడెం మీదుగా బాదంపూడి వరకూ రహదారి అధ్వానంగా ఉందన్నారు. తరచు ప్రమాదాలు జరుగుతున్నాయని అసెంబ్లీ దృష్టికి తీసుకెళ్లారు. ప్రధాన రహదారి ఇదే కాబట్టి రహదారిని పునర్నిర్మించాలని కోరారు.



ఉప్పుటేరు ప్రక్షాళనతోనే ముంపు సమస్య పరిష్కారం

ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

కైకలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ముంపు నివారణకు ఉప్పుటేరు ప్రక్షాళన పరిష్కారమని, దీనికి ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. ఉప్పుటేరు ముంపు సమస్యను బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. వర్షాకాలం వరదల ప్రభావానికి బుడమేరుతో పాటు కొల్లేరు ముంపునకు గురవుతుందన్నారు. ఉప్పుటేరు ప్రక్షాళనతోనే ముంపు నివారణ సాధ్యమవుతుందన్నారు. కైకలూరు నియోజకవర్గం ముంపునకు ముందు, సముద్ర చివర ఉంటుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో డ్రెయిన్లు, పంట కాలువలు అధ్వానం కావడంతో నీటి ప్రవాహాలకు తీవ్ర అవరోధంగా ఉందన్నారు. కాలువల్లో కిక్కిస తద్వారా పెరిగిపోవడంతో రైతులు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని శాసనసభ దృష్టికి తీసుకువెళ్లారు. జలవనరుల శాఖలో పనులు వల పెంబడి పర్యవేక్షించేందుకు లస్కర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆ పోస్టులను భర్తీ చేయాలని కోరారు. ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్ అండ్ బీ పంచాయతీ రాజ్ శాఖలలో 40 శాతం పైగా ఉద్యోగుల కొరత ఉందని అవసరాన్ని బట్టి నవిలాలను నియమించి ఆయా శాఖలకు కేటాయించే దిశగా ఆలోచన చేయాలని శాసనసభ దృష్టికి తీసుకు వెళ్లారు.

ప్రేమ జంటపై దాడి

యువతిని తీసుకెళ్లిన బంధువులు
ఆస్పత్రిలో చేరిన యువకుడు
కేసు నమోదు చేసిన పోలీసులు

ఏలూరు క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రేమించి పెళ్లి చేసుకున్న జంట పెద్దల నుంచి రక్షణ కల్పించాలని పోలీసులను ఆశ్రయించింది. ఈనెల 3న యువతి బంధువులు తమపై దాడిచేసి తన భార్యను తీసుకుపోయారంటూ యువకుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై ఏలూరు త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఏలూరు సమీపంలోని చొదిమెళ్లలోని వీవర్స్ కాలనీకి చెందిన దాడిశెట్టి మణికంఠ (29) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అమరావతి బలుసుపాడు గ్రామానికి చెందిన యువతి కూడా హైదరాబాద్‌లో జాబ్ చేస్తోంది. వారిద్దరి మధ్య స్నేహం ప్రేమగా మారింది. ఏడాది పాటు హైదరాబాద్‌లోనే సహజీవనం చేస్తున్నారు. వారి ప్రేమ విషయం తల్లిదండ్రులకు తెలియడంతో సంక్రాంతి సెలవులకు వెళ్లిన ఆమెను ఇంట్లో నిర్బంధించారు. గత నెల 10న ఆమె పారిపోయి చొదిమెళ్ల గ్రామానికి చేరింది. మణికంఠ, యువతి కలిసి ఏలూరులో ఒక ఆలయ వివాహ సంస్థ వద్ద వివాహం చేసుకున్నారు. అనంతరం వారు ద్వారకాతిరుమలలో కూడా వివాహం చేసుకున్నారు. అనంతరం యువతి తల్లిదండ్రులు, బంధువులతో తమకు ప్రాణహాని ఉందని పెదవేగి పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి తరపు బంధువులు ఈనెల 3న చొదిమెళ్ల వచ్చి ప్రేమికులపై దాడిచేసి ఆమెను కారులో తీసుకువెళ్లిపోయారు. మణికంఠ ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చేరడంతో వైద్యుల ఎమ్మెల్సీ సమాచారం ఇవ్వడంతో త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నేహితుల కొట్లాట.. ఒకరి మృతి

- మద్యం మత్తులో గొడవ
- హత్య కేసు నమోదు

ఆత్రేయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పాత గొడవను పురస్కరించుకుని మద్యం మత్తులో ఇద్దరు స్నేహితుల మధ్య గొడవ జరిగింది. ఆత్రేయి మండలం దంతపల్లి గ్రామంలో జరిగిన ఈ సంఘటనలో ఒకరు మృతి చెందారు. పోలీసులు హత్య కేసు నమోదు చేశారు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు ఆత్రేయి మండలం దంతపల్లి గ్రామానికి చెందిన జుత్తిగ వీరాంజనేయులు (35) కొబ్బరికాయల దింపు పనికి వెళుతుంటాడు. అదే గ్రామానికి చెందిన కడలి వెంకటేశ్వరరావు అలియాస్ వెంకట నారాయణ, జుత్తిగ వీరాంజనేయులు స్నేహితులు. వీరిద్దరు కలిసి తరచు మద్యం సేవిస్తూ ఉంటారు. ఆరు నెలల క్రితం వీరాంజనేయులు, అతని స్నేహితుడు వెంకటేశ్వరరావు కడి చెవి వద్ద కత్తితో గాయం చేశాడు. అప్పటి నుంచి వెంకటేశ్వరరావుపై కక్ష పెంచుకున్నాడు. మంగళవారం మధ్యాహ్నం సమయంలో ఇద్దరు కలిసి మహంకాళమ్మ ఆలయం వద్ద బల్లపై కూర్చుని మద్యం సేవించారు. ఈ సమయంలో పాత గొడవను పురస్కరించుకుని ఇద్దరు మధ్య ఘర్షణ జరిగింది. కడలి వెంకటేశ్వరరావు రాయితో వీరాంజనేయులు తల, ముఖంపై కొట్టి పక్కనే ఉన్న పంట కాలువలో పడేసి ఇంటికి వెళ్లిపోయాడు. రాత్రి సమయానికి వీరాంజనేయులు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెంకటేశ్వరరావును నిలదీయగా తానే రాయితో కొట్టి హత్య చేసినట్టు ఒప్పుకున్నాడు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని కాలువలో పడి ఉన్న మృతదేహాన్ని బయటకు తీసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆత్రేయి ఎస్ఐ పి ప్రేమరాజు ఆధ్వర్యంలో చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తణుకు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఒక కుమార్తె ఉన్నారు. భార్యభర్తల గొడవలతో భార్య రెండేళ్ల క్రితం పుట్టింటికి వెళ్లిపోయింది. వెంకటేశ్వరరావు అల్లరి చిల్లరగా తిరుగుతుంటాడని తెలిసింది. మృతుడి సోదరి మట్టపర్తి మంగాయమ్మ ఫిర్యాదు మేరకు హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువతి మృతి



బుట్టాయగూడెం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పదస్థితిలో యువతి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని బుడుగువారి లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొడ్డ రేఖ మాధవి(22) బుధవారం బుడుగువారిలోని తన ఇంటిలో ఉరి వేసుకుని మరణించింది. ఆమెకు 8 నెలల క్రితం బొడ్డ వంశం సాయికిరణ్‌తో వివాహం జరిగింది. రేఖామాధవి జంగారెడ్డిగూడెం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫైనలియర్ డిగ్రీ చదువుతుండగా సాయికిరణ్ వెటర్నరీ పూర్తిచేసి ఖాళీగా ఉంటున్నాడు. యువతి మృతి సమాచారం అందుకున్న జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వరరావు, బుట్టాయగూడెం ఎస్ఐ దుర్గా మహేశ్వరావు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువులు భర్తపై అనుమానం వ్యక్తం చేశారు. ఎస్సై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

ముదినేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో తిరగడం మాని కూలి పనులకు వెళ్లమని తల్లి మందలించడంతో కొడుకు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ముదినేపల్లి మండలం వడాలి గ్రామంలో జరిగింది. కలికల నాగబాబు (18) కొంత కాలంగా కూలి పనులకు వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి అతని తల్లి కుమారుడిని మందలించింది. దీంతో మనస్తాపానికి గురైన నాగబాబు ఎలుకల మందు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే అతనిని ఆసుపత్రికి తీసుకెళ్లగా ఫలితం లేకపోయింది. నాగబాబు మృతదేహానికి గుడివాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టు మార్టం నిర్వహించారు. కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

బాలికపై లైంగిక దాడి : పోక్సో కేసు నమోదు

పెదపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తనతో సహజీవనం చేస్తున్న వ్యక్తి తన కుమార్తె (16)పై లైంగిక దాడికి పాల్పడ్డాడని వసంతవాడ గ్రామానికి చెందిన మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్సై శుభశేఖర్ కథనం ప్రకారం... శారద సతీష్ బుధవారం కేసు నమోదు చేశారు. సుమారు 12 ఏళ్ల క్రితం భర్తతో విడిపోయి ఇద్దరు కుమార్తెలతో వసంతవాడలో నివాసం ఉంటున్న మహిళ అదే గ్రామానికి చెందిన సహదేవ ఆనంద్ అనే వ్యక్తితో సహజీవనం చేస్తోంది. పెద్ద కుమార్తె 10వ తరగతి ఫెయిల్ కావడంతో ఇంటి వద్దనే ఉంటోంది. ఇటీవల నాని తన పెద్ద కుమార్తెపై లైంగికదాడికి పాల్పడినట్లు గుర్తించి పెదపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు.

నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ

పెదపాడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి):ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వట్లూరులోని గవర్నమెంట్ ఐటీఐ కళాశాలలో నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించనున్నట్టు సంస్థ తెలిపింది. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, జూనియర్ ఫీల్డ్ టెక్నీషియన్ హోమ్ అప్లైయెన్స్‌లలో మూడు నెలల పాటు ఉచిత శిక్షణ ఉంటుందన్నారు. టెన్త్ ఆపై అర్హత ఉన్న 35 ఏళ్లలోపు యువత 89785 24022 నెంబరులో సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఏలూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : చాటపర్రు సెక్షన్ పరిధిలో ఉన్న 11కె.వి చాటపర్రు టౌన్ ఫీడర్ పరిధిలోని చాటపర్రు, చంద్రబాబు నాయుడు కాలనీ, ఎస్సీ కాలనీ, బాబూఖాన్‌గూడెం తదితర ప్రాంతాల్లో ఈ నెల 7వ తేదీన ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఆపరేషన్ సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.ఎం.అంబేద్కర్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చింతలపూడి/పెదపాడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ఐదు నుంచి ఎనిమిదవ తరగతి వరకు, ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్టు నాగిరెడ్డిగూడెం గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ ఎం.బ్రాహ్మణేశ్వరమ్మ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ప్రవేశ పరీక్ష ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ఇంటర్, డిగ్రీ తరగతులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రవేశ పరీక్ష జరుగుతుందని, త్వరలో పరీక్షా తేదీని ప్రకటిస్తామని తెలిపారు. చింతలపూడి గురుకుల పాఠశాలలో వసతి సౌకర్యం ఉందని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వట్లూరు గురుకుల పాఠశాలకు

పెదపాడు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థులు చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పెదపాడు మండలం వట్లూరులోని డాక్టరు బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 6వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అర్హత ఉన్నవారు ఆన్‌లైన్ ద్వారా లేదా వట్లూరులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సంప్రదించాలని కోరారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేయించుకోవాలి

పెదపాడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రైతు తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో పేర్లు నమోదు చేయించుకోవాలని, దీనిద్వారా ప్రభుత్వం రైతులకు అందించే అన్ని రకాల రాయితీలు పొందవచ్చని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.కె.హబీబ్ తెలిపారు. పెదపాడు మండలం కొక్కిరపాడు, వసంతవాడ గ్రామాల్లో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో పాల్గొని రైతులతో మాట్లాడారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రేషన్‌తో పాటుగా ఇ-పంట నమోదు, ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో ప్రదీప్ కుమార్, వెటర్నరీ డాక్టరు రమణ, రవి, రైతులు పాల్గొన్నారు.

గిరిజనుల డోలి కష్టాలు తొలగించండి : సీపీఐ

బుట్టాయగూడెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలోని గ్రామాల్లో రోడ్లను అభివృద్ధి చేసి గిరిజనుల డోలి కష్టాలను తొలగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, డివిజన్ కార్యదర్శి కారం దారయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏజెన్సీలోని గిరిజనుల సమస్యలను పరిష్కరించాలని, ఏపీ గిరిజన సమాఖ్య కార్యాలయానికి స్థలాన్ని కేటాయించాలని కోరుతూ నాయకులు తహసీల్దార్ పి.వి.చలపతిరావుకు వినతిపత్రం అందజేశారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఏజెన్సీలో రోడ్లు సరిగా లేకపోవడంతో వైద్యం కోసం ఇప్పటికీ డోలిలో ఆసుపత్రికి తరలించాల్సి వస్తోందని వాపోయారు. అలాగే టి.కట్టుపల్లి, రామన్నగూడెం గ్రామాల్లో భూసమస్యలను పరిష్కారించాల నాయకులు చోడెం దుర్గ, డి.శివకుమార్, ఎం.క్రాంతి, ఎం.దుర్గారావు, టి.మునేశ్వరరావు విన్నవించారు.

అంగన్వాడీల్లో పౌష్టికాహారంపై అవగాహన

దెందులూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : అంగన్వాడీల్లో పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించి మంచిపేరు తెచ్చుకోవాలని దెందులూరు అంగన్వాడీ సెక్టార్ సూపర్ వైజర్లు చిట్టెమ్మ, శ్రీదేవి, పద్మభూషణం అన్నారు. బుధవారం మండలంలోని దెందులూరు, కొవ్వలి, సోమవరప్పాడు సెక్టార్ల పరిధిలో సూపర్ వైజర్ల ఆధ్వర్యంలో అంగన్వాడీ కేంద్రాల్లో పోషకాహారం చిరుధాన్యాల ప్రాముఖ్యతపై అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

భీమడోలులో జాతరకు సహకరించండి

భీమడోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) :భీమడోలులో ఈనెల 9న జరిగే అమ్మవారి జాతరకు సుమారు రెండు లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీస్ శాఖ కోరింది. ఈ మేరకు పోలీస్ శాఖ ఓ ప్రకటన విడుదల చేసింది. ఎమర్జెన్సీకి తప్ప శని, ఆదివారాల్లో భీమడోలులోకి వచ్చే మార్గాలను మూసివేయనున్నట్టు తెలిపారు. జాతరకు సంబంధించిన అన్నీ శనివారం మధ్యాహ్నం లోపు చేర్చుకోవాలన్నారు. కార్లు, మోటార్ సైకిళ్లను గ్రామ శివార్లలో పార్కింగ్ చేసుకోవాలన్నారు. పార్కింగ్ స్థలాల్లో ఆటోలు ఏర్పాటు చేస్తున్నామని అక్కడి నుంచి ఆటోలు ఎక్కి గ్రామాలకు చేరుకోవచ్చన్నారు. ఈ మేరకు జాతర కమిటీకి, పోలీసులకు అంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు కలెక్టరేట్ వద్ద కోకో రైతుల ధర్నా

ద్వారకాతిరుమల, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్ ధరలకు అనుగుణంగా కోకో గింజలను కొనుగోలు చేయాలని, కిలోకు రూ.900 ధర ఇవ్వాలని ఏపీ రైతు సంఘం, కోకో రైతు సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఈ డిమాండుకు అనుగుణంగా గురువారం ఉదయం 10గంటలకు కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ మేరకు మండలంలోని పంగిడిగూడెం, తిమ్మాపురం, సూర్యచంద్రరావుపేట, గొల్లగూడెం తదితర గ్రామాల్లో బుధవారం వారు పర్యటించి రైతు సమావేశాలు జరిపి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నేత కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల్లో 50వేల ఎకరాల్లో కొబ్బరి, పామాయిల్‌లో కోకో అంతర పంటగా సాగవుతోందన్నారు. ఏలూరు జిల్లాలో రాష్ట్రంలోనే అధిక విస్తీర్ణంలో సాగవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘనేతలు బొల్లు రామకృష్ణ, గుదిబండి రమేష్ రెడ్డి, కట్టా భాస్కరరావు, పలువురు కోకో రైతులు పాల్గొన్నారు.

అప్పుల బాధ భరించలేక యువకుడి అదృశ్యం

ఏలూరు క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : అప్పులు తీర్చలేక ఒక యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతనికోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏలూరు వన్‌టౌన్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేశారు. ఏలూరు తూర్పువీధి ఫిల్‌హౌస్ పేటకు చెందిన మారుమూడి అశోక్ కుమార్(30)అప్పులు చేశాడు. ఈ నేపథ్యంలో వారి మధ్య గొడవ జరగడంతో అతను ఈ నెల 4న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అతని కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చేపల చెరువుల ధ్వంసంలో అవినీతిపై ఫిర్యాదు

ఏలూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : కొల్లేరు 5వ కాంటూరులో అక్రమ చేపల చెరువులు ధ్వంసం చేయాలంటూ ఇటీవల సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది.దీంతో జిల్లా అటవీ శాఖ అధికారులు అక్రమ చేపల చెరువులు ధ్వంసం చేయడం ప్రారంభించారు. అదే అదునుగా కొందరు అటవీశాఖ అధికారులు చేపల చెరువులు ధ్వంసం విషయంలో అవినీతికి పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. డబ్బులిచ్చిన రైతుల చెరువులకు ఒకరకంగా, డబ్బులివ్వకపోతే మరో రకంగా గండ్లు పెడుతున్నారంటూ శ్రీపర్రు గ్రామానికి చెందిన చేపల చెరువుల రైతు ఘంటసాల నాగభూషణం ఆరోపించారు. ఈ మేరకు అటవీశాఖ ఫారెస్ట్ అధికారికి, రాజమహేంద్రవరం సీసీఎఫ్‌కు ఫిర్యాదు చేశారు. చేపల చెరువుల ధ్వంసం విషయంపై సుప్రీమ్‌కోర్టు ఆదేశాలను తప్పనిసరిగా పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు

ఏలూరు క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పద్దెనిమిది సంవత్సరాల వయస్సు నిండిన తరువాతే మోటారు వాహనాలను నడపాలని ఏలూరు ట్రాఫిక్ సార్జంట్ కె.వెంకటేశ్వరరావు తెలిపారు. ఏలూరు ట్రాఫిక్ సీఐ లక్ష్మణరావు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం నగరంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ చర్యలను చేపట్టారు. ఇంటర్మీడియట్ విద్యార్థుల పరీక్షలు జరుగుతున్న నేపథ్యంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా ఉండడంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు చర్యలు చేపట్టారు. ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్న దృష్ట్యా 12 గంటల తరువాత విద్యార్థులంతా ఒకేసారి పరీక్షా హాల్స్ నుంచి బయటకు రావడం, వారి కోసం తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వాహనాలతో రావడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. మరోవైపు ఫైర్‌స్టేషన్ పెట్రోల్ బంకు వద్ద ట్రాఫిక్ సార్జంట్ కె.వెంకటేశ్వరరావు కౌన్సెలింగ్ నిర్వహించారు. 18 ఏళ్ళు నిండిన తరువాతే రవాణాశాఖ కార్యాలయం నుంచి లైసెన్సు పొందాలని సూచించారు.



● అభినందనలు

ఉంగుటూరు : నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్సీలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. అలపాటి రాజేంద్ర ప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరంలను కలిసి అభినందనలు తెలిపారు.

నిర్ణయం మీది.. తిప్పలు మావి!

చింతలపూడిలో డ్రెయినేజీపై మూతల తొలగింపు - ఓపెన్ చేయడంతో పేరుకున్న వ్యర్థాలు - దుర్గంధం, దోమలతో ప్రజలకు తప్పని పాట్లు



డ్రెయినేజీలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు

చింతలపూడి, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : అధికారుల నిర్ణయాలు కొన్ని మేలు చేసినప్పటికీ మరికొన్ని బెడిసికొడుతున్నాయి. డ్రెయినేజీ ఓపెన్‌గా ఉండాలనే కమిషనర్ నిర్ణయంతో నగర పంచాయతీ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాగే వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలు ఇదేమిటంటూ ముక్కుమూసుకుంటున్నారు. 2006లో రోడ్డు విస్తరణ సమయంలో ఆర్అండ్‌బీ శాఖ పాత బస్టాండ్ నుంచి కొత్తబస్టాండ్ వరకు రోడ్డుకు ఇరుపక్కలా డ్రెయినేజీ నిర్మించి కాంక్రీట్ రాళ్లు మూతలగా వేశారు.గతంలో మురుగు తొలగించి రాళ్లను పక్కన వేశారు. ఓపెన్ డ్రెయిన్‌గా ఉంచారు. దీంతో డ్రెయినేజీ సమస్య మరింత జఠిలమైంది. ఇదిలా ఉంటే మెయిన్ రోడ్డుపై ఓపెన్ డ్రెయిన్ ఉండటం సరికాదని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు. అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఓపెన్ డ్రెయినేజీగా వదిలేసిన నేపథ్యంలో షాపుల ముందు మాత్రమే రెండు రాళ్లు వేసుకున్నారు. డ్రెయినేజీ మీద రాళ్లు వేయకూడదనే ఉద్దేశంతో వాటిని దూరంగా తరలించారు. ఈ నిర్ణయం తీసుకున్న నెల గడవకముందే ఓపెన్ డ్రెయిన్‌లు డస్ట్‌బిన్‌లుగా దర్శనమిస్తున్నాయి. పట్టణానికి వచ్చే ప్రజలు, దుకాణదారులు డ్రెయిన్లలో చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడంతో అధ్వానంగా కనిపిస్తున్నాయి. ఫలితంగా సాయంత్రమైతే చాలు దోమలు విజృంభిస్తున్నాయి. రోడ్డు పక్కన నిలబడలేని పరిస్థితి ఏర్పడింది. దోమలు, మురుగు వాసనతో దుకాణదారులతో పాటు పట్టణ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

డస్ట్‌బిన్‌లు ఏమయ్యాయో?

గతంలో పనిచేసిన మునిసిపల్ అధికారి రోడ్డు ఆక్రమణలు తొలగించి గోద్రేజ్ పామాయిల్ ఫ్యాక్టరీ సహకారంతో మెయిన్ రోడ్డులోని ప్రధాన వీధుల్లో డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయించారు. ఇప్పుడు పెట్రోల్ బంకు నుంచి కొత్తబస్టాండ్ వరకు ఒక్క డస్ట్‌బిన్ కూడా లేకపోవడంతో మురుగు కాలువ ప్లాస్టిక్ బాటిల్స్, చెత్తతో నిండిపోయింది. దీంతో మురుగు పారకుండా నిలిచిపోయింది. ఇంత దారుణంగా ఉన్నా అధికారులు ఏ చర్యలూ తీసుకోవడం లేదు. కనీసం ఈ డ్రెయిన్‌లలో బ్లీచింగ్ కూడా చల్లడం లేదు. కొందరు ఈ ఇబ్బందులు తాళలేక దుకాణాల ముందు నాపరాళ్లు వేసుకుంటున్నారు.

ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోతున్నాయి

పొట్టి సత్యనారాయణ, చింతలపూడి



గతంలో రాళ్లు ఉన్నప్పుడు నీరు వెళ్లేది. ఏడాదికోసారి రాయి తీసి సిల్టు తీసేవారు. ఇప్పుడు ఓపెన్ డ్రెయిన్‌గా ఉంచడం వల్ల చిన్న పిల్లలు దానిలో పడిపోతున్నారు. అంతేకాకుండా డ్రెయినేజీ అధ్వానంగా తయారవుతోంది. ప్లాస్టిక్ వ్యర్థాలతో నింపేస్తున్నారు. మునిసిపల్ అధికారుల చర్య సరైనదికాదు.

అధికారుల తీరు సరైనదికాదు

పట్నాల వరప్రసాద్, చింతలపూడి



అధికారులు వచ్చినప్పుడల్లా వారికి తోచిన రీతిలో నిర్ణయాలు తీసుకోవడం సరైందికాదు. నాలుగు లైన్ల రోడ్డులో ఇరుపక్కలా ప్రభుత్వం వేసిన రాళ్లను మునిసిపల్ అధికారులు తొలగించడం సరికాదు. అధికారుల్లో సమన్వయం లేకపోవడంతో ప్రజలు దోమల బారిన పడుతున్నారు.

8న మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం : కలెక్టర్

ఏలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ మ హిళా దినోత్సవాన్ని ఈ నెల 8న ఏలూరు సర్ సీఆర్ రెడ్డి డిగ్రీ కళాశాల ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించనున్నట్టు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. మహిళా దినోత్సవం ఏర్పాట్లపై కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో ఆమె ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల సమన్వయంతో ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని సూచించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో 25 స్టాల్స్‌ను ఏర్పాటు చేయాలన్నారు.చేనేత వస్త్రాలు, హస్త కళలకు స్టాల్స్ ఉండాలన్నారు. మూడ్రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఇందులో 2కే రన్, సైకిల్ ర్యాలీ, మహిళలకు హెల్త్ చెకప్ శిబిరాన్ని నిర్వహించాలని వెట్రిసెల్వి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, డీఆర్‌డీఏ పీడీ ఆర్.విజయ రాజు, జడ్పీ సీఈవో కె.సుబ్బారావు, డీసీపీవో డాక్టర్ సూర్య చక్రవేణి, జలవనరుల శాఖ ఎస్ఈ పి.నాగార్జు నరావు, ఎల్డీఎం నీలాద్రి, పరిశ్రమల కేంద్రం జీఎం పి.సుబ్రహ్మణ్యేశ్వరరావులు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు మొక్కను అందజేస్తున్న ఎన్జీవో నేతలు

కలెక్టర్‌కు ఎన్జీవో నేతల అభినందన

ఏలూరు రూరల్ : ఇటీవల జరిగిన ఉభయ గోదావరి పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సజావుగా, ప్రశాంతంగా నిర్వహించిన కలెక్టర్ కె.వెట్రిసెల్విని బుధవారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్కను అందచేసి అభినందించారు. అనంతరం వీరిని కలెక్టర్ అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఆహ్వానించారు. ఇరిగేషన్ డివిజన్ కాంపౌండ్‌లో మహిళా ఉద్యోగులు ఆయా పోటీల్లో పాల్గొనేందుకు ఆయా కార్యాలయాల్లో పర్మిషన్ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కన్వీనర్ నెరుసు రామారావు పాల్గొన్నారు.

పోలవరం కుడి కాలువపై ఘాట్లు : చింతమనేని

పెదవేగి, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : ప్రజల సౌకర్యాలను దృష్టిలో పెట్టుకుని పోలవరం కుడి కాలువపై ఘాట్ల నిర్మాణానికి చర్యలు చేపట్టామని, దీనికోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సంబంధిత శాఖాధికారులను ఆదేశించారు. పెదవేగి మండలం దుగ్గిరాల క్యాంపు కార్యాలయంలో నీటిసంఘం అధ్యక్షులు, కూటమి నాయకులు, పోలవరం కుడికాలువ, నీటిపారుదల శాఖ, పంచాయతీరాజ్ ఇంజనీర్లతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ పనుల కోసం మంత్రి నిమ్మల రామానాయుడు కోటి రూపాయలు మంజూరు చేశారని ఆయన తెలిపారు. గృహ నిర్మాణ శాఖకు సంబంధించి నియోజకవర్గ పరిధిలో ఇంటి స్థలం ఉన్న అర్హులకు రుణాలు మంజూరు చేసేలా జాబితాను సిద్ధం చేయాలని కూటమి నాయకులకు ఎమ్మెల్యే ప్రభాకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, మాగంటి నారాయణ ప్రసాద్, కమ్మ శివరామ కృష్ణ, నంబూరి నాగరాజు, లావేటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

నందిగం రాణి ఆస్తులు జప్తు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

ఏలూరు క్రైం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకురాలు నందిగం రాణి తన సంస్థల్లో వాటా ఇస్తానంటూ నమ్మబలికి పలువురి నుంచి అధిక మొత్తంలో నగదు డిపాజిట్లు సేకరించి ఆపై వారిని మోసగించడంతో పలు ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో అరెస్టు కూడా అయ్యారు. ఈ నేపథ్యంలో నందిగం రాణికి చెందిన 14.74 కోట్ల రూపాయల విలువైన ఆస్తులను జప్తు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కామవరపుకోట మండలం తడికలపూడిలో ఉన్న హర్షిత ఇంగ్లీషు మీడియం స్కూలు, హర్షిత ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్వాహకురాలైన నందిగం రాణి, పలువురు ఎన్ఆర్ఐలు, వివిధ ప్రాంతాల్లో ఉన్న వారి నుంచి తమ సంస్థలో పెట్టుబడులు పెడితే ఏడాదికి 24 శాతం వడ్డీతో పాటు లాభాల్లో 5 శాతం వాటా ఇస్తానంటూ 15 మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేశారు. ఆ సొమ్ములతో పాఠశాల భవనాల నిర్మాణాలు నిర్మించారు. తడికలపూడిలో 4.05 ఎకరాల భూమిని కొన్నారు. గందిగం రాణి ఆమె కుటుంబ సభ్యులపై పలు కేసులు నమోదయ్యాయి. సీఐడీ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని విచారించారు. మొత్తం మీద నందిగం రాణి పేరుపై ఉన్న ఆస్తులను గుర్తించి సీజ్ చేస్తూ హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ ఈశ్వర్‌జిత్ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో సీఐడీ అధికారులు దీనికి సంబంధించిన పిటీషన్‌ను కోర్టులో వేయడానికి ప్రభుత్వం నుంచి అనుమతి పొందారు.



పనుల వివరాలు తెలుసుకుంటున్న జేసీ ధాత్రిరెడ్డి

భీమడోలులో జేసీ పర్యటన

భీమడోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో మహిళలు, పిల్లలకు ప్రభుత్వం నిర్దేశించి పౌష్టికాహారం అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రి రెడ్డి అధికారులను ఆదేశించారు. భీమడోలు మండలంలో బుధవారం పర్యటించిన జేసీ వివిధ శాఖల పరిధిలో జరుగుతున్న పనులను పరిశీలించారు.అనంతరం జేసీ మాట్లాడుతూ అంగన్ వాడీల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారంపై అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే పూర్తి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.ఏలూరు కాలువలో తూడు, గుర్రపు డెక్క తొలగింపు పనులు, సూరప్పగూడెంలో జరుగుతున్న భూమి రీ సర్వే తీరును పరిశీలించారు. ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్, ఇరిగేషన్ శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ నాగార్జునరావు, సర్వే ఏరియా అధికారి, తహసీల్దార్ రమాదేవి, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.



● మద్యానికి దూరంగా ఉండాలి

లింగపాలెం : ఎక్సైజ్ ఎస్ఐలు ఆర్‌వీఎల్ నరశింహరావు, అబ్దుల్ ఖలీల్ ఆధ్వర్యంలో లింగపాలెం మండలం యడవల్లిలో సారా నిర్మూలనపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో సారా లేకుండా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. అనంతరం గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు.

మంత్రి కొలుసు పార్థసారథి హర్షం

ఏలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : శాసన మండలి ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు ఘన విజయం లభించడంపై రాష్ట్ర సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి హర్షం వ్యక్తం చేశారు. సాధారణ ఎన్నికల కంటే ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులకు అధిక మెజార్టీ లభించిందని, ఇది కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమం, అభివృద్ధికి నిదర్శనమన్నారు. కూటమి విజయంలో కీలక పాత్ర పోషించిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు పార్థసారథి ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు నాయకత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని పట్టభద్రులు గుర్తించారన్నారు.

ఎమ్మెల్సీ విజయోత్సవం

భీమడోలు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : కూటమి తరపున పోటీ చేసిన ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం విజయం సందర్భంగా ఏలూరు జిల్లా టీడీపీ క్యాంపు కార్యాలయంలో ఆ పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. కూటమి నాయకులు క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుకున్నారు. ఎమ్మెల్సీ గెలుపునకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ గన్ని వీరాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నేతలు శిరిబత్తిన వీరవెంకట సత్యనారాయణ, శంకర శ్రీనివాస్, పుప్పాల హరి, కరణం పెద్దిరాజు, వెంకటేష్‌బాబు, పుల్లయ్యనాయుడు, సత్యనారాయణ, శేషగిరి, రామతులసమ్మ, ప్రవీణ్ పటేల్, శ్యామల, అప్పారావు, రమేష్ పాల్గొన్నారు.



కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకుంటున్న నాయకులు

లింగ సమానత్వంపై పోటీలు

టి.నరసాపురం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): బొర్రంపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో లింగ సమానత్వంపై విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు బాలికల పట్ల వివక్ష చూపకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్.ఎం మహ్మద్ అలీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తాగు నీటి ఎద్దడి రానివ్వొద్దు

ఏలూరుటూటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): రానున్న వేసవిలో నగర ప్రజలకు తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుకు విజ్ఞప్తి చేశారు. బుధవారం అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో నియోజకవర్గ సమస్యలను చంటి వివరించారు. ఏలూరులోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులో రోజురోజుకు నీటి నిల్వలు పడిపోతున్నాయన్నారు. దీనికి కారణం ఇరిగేషన్ అధికారులు కృష్ణా, గోదావరి కాల్వల్లోకి నీరువదలకపోవడమే అని అన్నారు. ఇరిగేషన్ మంత్రి నిమ్మల రామానాయుడు ఇరిగేషన్ అధికారులకు చెప్పినప్పటికి తగు చర్యలు తీసుకోలేదన్నారు. కాల్వల మరమ్మతులకు ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రూ.5 లక్షలు కేటాయించినా అధికారులు దృష్టి సారించకపోవడం తీవ్రమైన చర్యగా భావించాలన్నారు.

ఉపాధి అవకాశాలు కల్పిస్తాం : చంటి

ఏలూరు టూటౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. కొన్ని సమస్యలు అప్పటికప్పుడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించారు.యువత నిరాశ చెందవద్దని ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ఎవ్వరూ అధైర్యపడొద్దని భరోసా ఇచ్చారు.

అటెండర్‌కు పదవీ విరమణ సత్కారం

ఏలూరు కార్పొరేషన్, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని వివిధ దేవాలయాల్లో అటెండర్‌గా పనిచేసి గత నెలాఖరున ఉద్యోగ విరమణ చేసిన వాడపల్లి రామును బుధవారం అగ్రహారంలోని జనార్దన స్వామి ఆలయం వద్ద పలు వురు ఈవోలు ఘనంగా సత్కరించారు. రాము దంపతులను దుశ్శాలువాతో సత్కరించి జ్ఞాపిక బహూకరించారు. కార్యక్రమంలో ఈవోలు నాగబాబు, సి.హెచ్.చిననాగేశ్వరరావు హాజరయ్యారు.



విలేకర్లతో మాట్లాడుతున్న రెడ్డి అప్పలనాయుడు

'నామినేటెడ్ పదవులు కేటాయించండి'

ఏలూరు రూరల్, మార్చి 5(ఆంధ్రజ్యోతి): త్వరలో నియమించనున్న నామినేటెడ్ పదవుల్లో జనసేన పార్టీకి 40శాతం పోస్టులు కేటాయించాలని, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ రెడ్డిఅప్పలనాయుడు డిమాండ్ చేశారు. ఏలూరు పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఠాపురంలో ఈనెల 14న జరగనున్న ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ వ్యాప్తంగా జనసేన అభిమానులు తిలకించేలా ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. 14న జరిగే ఆవిర్భావ సభకు ఏలూరు నుంచి భారీసంఖ్యలో నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలతో తరలివెళ్తున్నామన్నారు. ఈ సమావేశంలో ఒబిలిశెట్టి శ్రావణ్ గుప్తా, నగిరెడ్డి కాశీనరేష్, పరిధి రాజేష్, ధర్మేంద్ర, రవి, వీరంకి పండు, రెడ్డి గౌరీశంకర్, తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్' ఇంటర్ పరీక్షలకు 59 మంది గైర్హాజరు

ఏలూరు అర్బన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఏపీ సార్వత్రిక విద్యాపీఠం(అపోస్) దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షల్లోభాగంగా బుధవారం జరిగిన తెలుగు పరీక్షకు జిల్లాలో 511 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 454 మంది, హిందీ పరీక్షకు 17మందికి 15మంది, ఉర్దూ పరీక్షకు నలుగురు హాజరయ్యారని డీఈవో వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

ఇంటర్ ఇంగ్లీషు పరీక్షకు..

ఇంటర్మీడియట్ థియరీ పరీక్షల్లో భాగంగా బుధవారం జరిగిన ద్వితీయ సంవత్సరం ఇంగ్లీషు పరీక్షకు జిల్లాలో మొత్తం 14,241మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 13,890 మంది హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు. జనరల్ విభాగంలో 12,435మందికి 12,207 మంది, ఒకేషనల్ విభాగంలో 1806మందికి 1683మంది హాజరయ్యారని వివరించారు.

9న రవన్న వర్ధంతి

బుట్టాయగూడెం, మార్చి 5(ఆంధ్రజ్యోతి) : గోదావరి లోయ ప్రతిఘటన పోరాట యోధుడు రాయల సుభాష్ చంద్రబోస్ అలియాస్ రవన్న 9వ వర్ధంతి సందర్భంగా ఈ నెల 9న జంగారెడ్డిగూడెంలో జరగనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ పిలుపునిచ్చారు. బుధవారం చింతకొండలో వర్ధంతి గోడప్రతులను విడుదల చేశారు. 48 సంవత్సరాలు అజ్ఞాతంలో గడిపిన రవన్న విప్లవ ఉద్యమం బలోపేతానికి కృషి చేశారన్నారు. ఈ మేరకు నిర్వహిస్తున్న వర్ధంతి సభకు వేలాదిగా తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు బి.వినోద్, ముక్కారెడ్డి, రాజు, సతీష్ కుమార్, ప్రసాద్‌రెడ్డి, నాగన్న పాల్గొన్నారు.

మహిళలపై దాడులు అరికట్టాలి

కుక్కునూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న దాడులను అరికట్టాలని ఏపీ మహిళా సమాఖ్య కుక్కునూరు మండల కార్యదర్శి వరకా శ్యామలా డిమాండ్ చేశారు. బుధవారం కివ్వాక గ్రామంలో జరిగిన మహిళా దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ సమాజంలో మహిళలకు రక్షణ లేకుండాపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రత్తమ్మ, స్వరూప, అన్నపూర్ణ, సుజాత, నర్సమ్మ పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

కుక్కునూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి) :మండల పరిధిలోని పెదరాయిగూడెంలో బనోతు సురేష్ అనే వ్యక్తి ఇల్లు ఇటీవల అగ్నిప్రమాదంలో కాలిపోయింది. ఈ క్రమంలో సీపీఐ మండల నాయకులు బుధవారం బాధిత కుటుంబానికి రూ.2వేల నగదు, దుస్తులు అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి ఎం.వెంకటాచారి మాట్లాడుతూ బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బాబూరావు, ఎం.వెంకట రమణ పాల్గొన్నారు.

8న లోక్ అదాలత్

ఏలూరు క్రైం, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 8వ తేదీన జరిగే లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న న్యాయసేవాధికార సంస్థ భవనంలో బుధవారం ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమడోలు, చింతలపూడి కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమావేశమయ్యారు. కక్షిదారులతో మాట్లాడి వారి కేసులు రాజీపడేలా ప్రయత్నం చేయాలన్నారు. రాజీకి అనుకూలమైన కేసులు గుర్తించడం జరిగిందని అవన్నీ పరిష్కారం జరిగేలా కక్షిదారులకు కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. ప్రత్యక్షంగాగాని, ఆన్‌లైన్ విధానం ద్వారా కాని లోక్‌అదాలత్‌కు హాజరై కేసులు పరిష్కరించుకోవచ్చన్నారు.

9 నుంచి వార్షికోత్సవాలు

కామవరపుకోట, మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : ఆడమిల్లి గ్రామంలోని పార్వతీ సమేత కంఠ మహేశ్వరస్వామి, హరిహరపుత్ర అయ్యప్ప స్వామి, కనకదుర్గ అమ్మవారి ఆలయ పంచమ వార్షికోత్సవాలు ఈ నెల 9 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త తాత సర్వేశ్వరరావు తెలిపారు. ఈ మహోత్సవాల్లో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరుగుతాయని, అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని చెప్పారు.

అద్దె ఇంటి కోసం వచ్చి వృద్ధురాలి ఒంటిపై బంగారం చోరీ



దాడిలో గాయపడిన వృద్ధురాలు

జంగారెడ్డిగూడెం (ఏలూరు), మార్చి 5(ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం పట్టణంలో దొంగలు చెలరేగిపోయారు. పట్టణంలోని డాంగే నగర్‌లో నివాసముం టున్న షేక్ పాతీముస్సీసా బేగం అనే రిటైర్డ్ టీచర్‌పై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు దాడి చేసి ఆమె మెడలోని హారం, చేతికి ఉన్న గాజులను బలవంతంగా లాక్కెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒంటరిగా నివాసముంటున్న ఆమె ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు చొరబడి ఇల్లు అద్దెకు దొరుకుతుందా అంటూ ఆరా తీశారు. అనంతరం వృద్ధురాలిపై దాడి చేసి నోరు మూసి మెడలోని బంగారు హారం, రెండు చేతులకు ఉన్న బంగారు గాజులను లాక్కుని పరారయ్యారు. ఈ ఘటనలో బాధితురాలి చేతికి గాయమైంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదుతో ఎస్సై జబీర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




రమణక్కపేట, గోపవరంలోని పశువైద్యశాల భవనాల దుస్థితి

పశువైద్యానికి దిక్కేది..!

శిథిలావస్థకు చేరిన పశు వైద్యశాలలు

ముదినేపల్లి/ ముసునూరు మార్చి 5 (ఆంధ్రజ్యోతి) : పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలోని గ్రామీణ పశువుల ఆస్పత్రుల భవనాల పరిస్థితి దయనీయంగా మారింది. భవనాలు శిథిలావస్థకు చేరడంతో పశువైద్యసేవలు అందించే అవకాశం లేకుండా పోయింది. భవనాలను ప్రాథమిక దశలోనే మరమ్మతులు చేయించకపోవడం వంటి కారణాలతో కొన్ని ఆస్పత్రులను ప్రైవేట్ గృహాల్లో నిర్వహించాల్సిన పరిస్థితి ఏర్పడింది. భవనాల మరమ్మతులకు నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలు ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్నాయే తప్ప శిథిల భవనాలకు గ్రాంటు మంజూరు కాలేదు.

ముదినేపల్లి మండలంలో మూడు వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్థాయి ఆస్పత్రులు, ఐదు వెటర్నరీ అసిస్టెంట్ స్థాయి పశువుల ఆస్పత్రులు ఉన్నాయి. వీటిలో పెదగొన్నూరు ప్రభుత్వ పశువుల ఆస్పత్రి భవనం, వాడవల్లిలోని పశువైద్యశాల భవనం, చేవూరు, చిగురుకోట, పెదపాలపర్రు పశువుల ఆసుపత్రుల భవనాలు శిథిలావస్థకు చేరుకుని పశువైద్య సేవలు నిర్వహించేందుకు అనువుగా లేవు. ముసునూరు మండల కేంద్రంలోని పశువైద్యశాల, రమణక్కపేట, గోపవరం గ్రామాల్లో ఉన్న పశు వైద్యశాల భవనాలు శిథిలావస్థకు చేరాయి. గత వైసీపీ వీటిని పట్టించుకోక పోవడంతో ఈ భవనాలు మరింత ప్రమాదకరంగా మారాయి. కూటమి ప్రభుత్వమైనా స్పందించి నూతన భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని రైతులు, వైద్యసిబ్బంది కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపినా..

శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలల్లో విధులు నిర్వర్తించాలంటే వైద్య సిబ్బంది భయభ్రాంతులకు గురవుతున్నారు. నూతన భవనాల నిర్మాణాలకు నిధులు కేటాయించాలని నాలుగేళ్లుగా సంబంధిత ప్రతిపాదనలను ఐదు విడతలుగా ఉన్నతాధికారులకు పంపాం. నేటికీ నిధులు మంజూరు కాలేదు.

- ఎం.వెంకట చైతన్య, పశువైద్యాధికారి, ముసునూరు



ఒరిగిపోయి కూలే దశలో చిగురుకోట పశువుల ఆసుపత్రి భవనం

ఎమ్మెల్సీ దువ్వాడపై జనసేన నాయకుల ఫిర్యాదు

కైకలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పవన్ కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌పై జనసేన నాయకులు కైకలూరు టౌన్ పోలీసుస్టేషన్లో కేసు నమోదు చేయాలని బుధవారం ఫిర్యాదు చేశారు. ప్రాంతాలు, పార్టీల మధ్య విద్వేషాలు రెచ్చ గొట్టి ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తూ మీడియా సమావేశంలో దువ్వాడ శ్రీనివాస్ చేసిన వ్యాఖ్యలు జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తల మనోభావాలు దెబ్బతీశాయన్నారు. అతనిపై కేసు నమోదు చేయాలని కైకలూరు నియోజకవర్గ జనసేన నాయకులు బెల్లంకొండ వెంకన్నబాబు, ముమ్మారెడ్డి నాగ మల్లేశ్వరరావు, మైగాపుల రామాంజ నేయులు, సిరిపురపు రాజబాబు, నందకిశోర్, రవితేజ, తదితరులు ఫిర్యాదు చేశారు.



ఎమ్మెల్సీ దువ్వాడపై కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేస్తున్న జనసేన నాయకులు



శిథిలావస్థకు చేరిన చారిత్రక జిల్లా పరిషత్ అతిథిగృహం

అతిథులు రాని పంచాయతీరాజ్ అతిథిగృహం

ఎన్ఎస్‌పీ అతిథిగృహం

శిథిలావస్థలో అతిథిగృహాలు

» ప్రభుత్వ భవనాలు నిరుపయోగం » గత ప్రభుత్వంలో తీవ్ర నిర్లక్ష్యం

నూజివీడు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడులో వివిధ శాఖల అతిథి గృహాలు శిథిలావస్థకు చేరాయి. మరమ్మతులకు గురైన భవనాలను నిర్లక్ష్యం చేయడంతో నిరుపయోగంగా మారాయి. అతిథులు వాటివైపు కన్నెత్తి చూడడం లేదు. భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూకు ఆతిథ్యం ఇచ్చిన జిల్లాపరిషత్ అతిథిగృహం సైతం నేడు దయనీయ స్థితికి చేరింది. నూజివీడు డివిజన్ పరిధిలోని శిథిల అతిథిగృహాలపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథనం.

మహనీయులకు ఆతిథ్యం

నూజివీడు మార్కెట్‌యార్డు ఎదురుగా ఉన్న జిల్లా పరిషత్ అతిథిగృహం జాతీయస్థాయిలో మహనీయులకు ఆతిథ్యం ఇచ్చింది. 1950వ దశకంలో భారత తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ ఈ అతిథిగృహంలో బస చేశారు. ఈ అతిథిగృహం పాలకుల నిర్లక్ష్యంతో నేడు శిథిలావస్థకు చేరుతోంది. ఈ భవనానికి మరమ్మతులు చేయిస్తే మరో అర్థశతాబ్దం పాటు సేవలందించే అవకాశం ఉంది.

పంచాయతీరాజ్, ఎన్ఎస్‌పీ అతిథిగృహాలు

పంచాయతీరాజ్ డీఈ కార్యాలయ ప్రాంగణంలో ఉన్న అతిథిగృహంతో పాటు ఎన్ఎస్‌పీ అతిథిగృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో కనీసం అటువైపు అధికారులు కన్నెత్తి చూడడం లేదు. గత తెలుగుదేశంపార్టీ ప్రభుత్వ హయాంలో ఈ అతిథిగృహాలకు మరమ్మతులు నిర్వహించారు. అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ అతిథిగృహాల నిర్వహణ పట్టించుకోకపోవడంతో తిరిగి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

అతిథిగృహాలను మరమ్మతులు నిర్వహించి ప్రస్తుతం అద్దెభవనాల్లో నడుస్తున్న ఎక్సైజ్, సబ్ రిజిస్ట్రార్, గృహ నిర్మాణశాఖ తదితర శాఖలకు కేటాయించడం ద్వారా ఆయాశాఖలకు ప్రభుత్వ భవనాలను అందుబాటులోకి తీసుకువచ్చే అవకాశం ఉంది. అద్దెల రూపేణా ప్రతినెలా కడుతున్న లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని కాపాడవచ్చు.

టెన్త్ విద్యార్థులు శ్రద్ధగా చదువుకోవాలి

ముసునూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి విద్యార్థులు శ్రద్ధగా చదివి మంచి మార్కులు సాధించాలని ఎంఈవో బీవీఎస్ సుబ్బారావు అన్నారు. ముసునూరు జడ్పీ పాఠశాలను బుధవారం ఆయన సందర్శించి పదో తరగతిలో విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థులకు పలు ప్రశ్నలు సంధించి జవాబులు రాబట్టారు. అనంతరం మధ్యాహ్న భోజనం రుచి చూశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్ ఆడిట్

ముదినేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరానికి ప్రభుత్వ పాఠశాలల్లో సోషల్ ఆడిట్ ప్రారంభమైంది. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు వివిధ యాజమాన్యాల అజమాయిషీలోని పాఠశాలల్లో వివిధ విద్యా విషయాలు, మౌలిక సదుపాయాలపై క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు బుధవారం పాఠశాలల్లో తనిఖీలు ప్రారంభించారు. ముదినేపల్లి మండలంలోని 59 మండల పరిషత్ ప్రాథమిక, అప్పర్ ప్రైమరీ పాఠశాలలు, 8 జిల్లా పరిషత్ హైస్కూళ్లలో సోషల్ ఆడిట్ నిర్వహించనున్నారు. క్లస్టర్ కేంద్ర పాఠశాలల హెచ్ఎంలతోపాటు క్లస్టర్ రిసోర్స్ పర్సన్లు విజయదుర్గ, కె.సంగీతరావు, జడ్డు ఆంజనేయులు, నిస్సీ, కోటేశ్వరమ్మ పాఠశాలల్లో ఎస్ఎంసీ చైర్మన్లు, సభ్యులు, ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాల వివరాలు సేకరిస్తున్నారు. తరగతి గదులు సరిపడా ఉన్నాయా? అవసరమైన ఫర్నీచర్ ఉందా ? తరగతి గదుల్లో గ్రీన్ బోర్డులు మురుగుదొడ్లు ఉన్నాయా ?మధ్యాహ్న భోజన పథకం నిర్వహణ, విద్యార్థులందరికీ ప్రభుత్వ సరఫరా చేసే పుస్తకాలు, దుస్తులు అందుతున్నాయా ? అదనపు భవన వసతి అవసరమా, ఆట స్థలాల పరిస్థితి, తాగునీటి సమస్య వంటి వివరాలను సేకరిస్తున్నారు. పాఠశాలల వారీగా నివేదికలు రూపొందించి పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు పంపుతారు. ఈ నివేదిక ఆధారంగా 2025-26 విద్యాసంవత్సరానికి పాఠశాలల అభివృద్ధి ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించి అవసరమైన నిధులను మంజూరు చేయటంతో పాటు మౌలిక సదుపాయాలను కల్పిస్తారు.



పెదపాలపర్రు హైస్కూల్‌లో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న సీఆర్పీ విజయ దుర్గ



పెద్దింటమ్మకు పూజలు చేస్తున్న దాతలు

పెద్దింటమ్మకు విశేష పూజలు

కైకలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కొల్లేటి కోట పెద్దింటి అమ్మవారి మహోత్సవాల్లో ఐదోవ రోజు బుధవారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ, ఉచిత ప్రసాదాన్ని కోళ్లపర్రుకు చెందిన కనుమూరి రంగరాజు, నాగపార్వతీ దంపతులు అందజేశారు. సాయంత్రం కైకలూరుకు చెందిన అడగర్ల సువర్చలదేవి ఆధ్వ ర్యంలో షిర్డీసాయి మహిళా బృందం కోలాట ప్రదర్శన నిర్వహించారు.

మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు

కలిదిండి : మూల్లంక పెద్దింటమ్మ ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మేళతాళాలు, విచిత్ర వేషధారణలు అసాదుల గరగ నృత్యాలతో జాతర నిర్వహించారు. కైకలూరు రూరల్ సీఐ రవికుమార్, ఎస్ఐ వెంకటేశ్వరరావు బందోబస్తు నిర్వహించారు. ఆలయ చైర్మన్ తమ్మినీడి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ బండి లక్ష్మీ, బోళ్ల ఏడుకొండలు, సర్పంచ్ విజయ్ పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి శాంతి కల్యాణం

ముదినేపల్లి : సింగరాయపాలెం- చేవూరుపాలెం సెంటర్‌లోని వళీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి జన్మ నక్షత్రమైన కృత్తిక నక్షత్రం సందర్భంగా బుధవారం శాంతి కల్యాణం జరిగింది. కమిషనర్ గంగా శ్రీదేవి పర్యవేక్షించారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు : ఈఈ

మండవల్లి మార్చి 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో నీటి ఎద్దడి లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ త్రినాథ్‌బాబు తెలిపారు. పెనుమాకలంకలో మంచినీటి కాల్వలు, రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించారు. వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు ద్వారా నీరును అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఇప్పటికే అన్ని గ్రామాల్లో మంచినీటి చెరువులను నీటితో నింపారని, తిరిగి ఏప్రిల్‌లో మరోసారి నీటిని నింపి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. పెనుమాకలంకలో రూ.90 లక్షలతో ఓవర్‌హెడ్ ట్యాంకు, మైక్రో ఫిల్టర్లు ఏర్పాటుచేసి రక్షిత మంచినీటిని ఏర్పాటు చేస్తామన్నారు. జల జీవన్ మిషన్ పనులు త్వరితగతిన పూర్తిచేసి అన్ని గ్రామాల్లో నీటిని అందిస్తామన్నారు. డీఈ శ్రీనివాస్, ఏఈ నాగబాబు, సర్పంచ్ నాగరాజు పాల్గొన్నారు.

జాతీయస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కైకలూరు విద్యార్థులు

కైకలూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో కైకలూరు వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రెండో స్థానం రావడం అభినందనీయమని ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అన్నారు. మంగళవారం విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన కృష్ణా యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఫైనల్లో పోటా పోటీగా ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానాన్ని సాధించారు. ఈ నెల 13వ తేదీన బెంగుళూరులో జరిగే నార్త్ యూనివర్సిటీలో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. క్రీడాకారులు ఎం.శరత్, సంపత్‌లను బుధవారం కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్ మన్నే శివనాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్, స్పోర్ట్స్ ఇన్‌చార్జి డాక్టర్ హరిప్రసాద్, అధ్యాపక బృందం అభినందించారు.



జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు



మంత్రి పార్థసారథికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏఎంసీ చైర్మన్ పదవి మాల సామాజిక వర్గానికి ఇవ్వాలి

నూజివీడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): నూజివీడు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ పదవి ఎస్సీ సామాజిక వర్గానికి కేటాయించిన నేపథ్యంలో మాలలకు కేటాయించాలని కోరుతూ మంత్రి కొలుసు పార్థసారథికి వినతిపత్రాన్ని అందించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు అరికోటి పాల్‌రాజు, టీడీపీ సీనియర్ నాయకులు నక్కా రాము, చందమాల సుందర్‌రావు నేతృత్వంలో పలువురు నాయకులు మంత్రిని కలిశారు. అజయ్‌బాబు, థామస్, అంబేద్కర్ పాల్గొన్నారు.

ఇంటర్ సెకండియర్ పరీక్ష ప్రశాంతం


ముదినేపల్లి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సెకండియర్ పరీక్ష బుధవారం ప్రశాంతం జరిగింది. ముదినేపల్లి మండలం ముదినేపల్లిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం జరిగిన ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ టు పరీక్షకు నలుగురు విద్యార్థులు హాజరు కాలేదు. 110 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 106 మంది హాజరయ్యారని చీఫ్ సూపరింటెండెంట్ ఓరుగంటి సత్యనారాణ మూర్తి తెలిపారు.

చాట్రాయి మండలంలో..

● చాట్రాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చాట్రాయి జడ్పీ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్ష బుధవారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకు 87 మందికి విద్యార్థులకు గాను మొత్తం హాజరైనట్లు ఎంఈవో వీఎస్‌వీ బ్రహ్మచారి తెలిపారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 114, 125
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210
నెక్ కోడి గుడ్డు ధర	(100)



విజయవాడ జోన్ రైతు ధర రూ.475

విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు

నూజివీడు టౌన్/చాట్రాయి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నూజివీడు పట్టణంలోని ఎస్ఆర్ఆర్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సమాజంలో మహిళల స్థానం, మహిళా శక్తీకరణం, మహిళల భద్రత అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలను వ్యక్తం చేశారు. టౌన్ సీఐ సత్య శ్రీనివాస్ మాట్లాడుతూ సమాజంలో విద్య, ఉద్యోగ, వ్యాపార రంగాల్లో మహిళలు అగ్రగామిగా కొనసాగుతున్నారన్నారు. మహిళల భద్రతపై అవగాహన పెంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు. చాట్రాయి మండలం మర్లపాలెం జడ్పీ హైస్కూల్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బుధవారం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. మహిళా సాధికారత, రక్షణ, హక్కులు అనే అంశాలపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. అభయ మహిళా రక్షక దళం సేవలు ఉపయోగించుకోవడం, అత్యవసర సమయాలలో డయల్ 112కి ఫోన్ చేసి సహాయం పొందడంపై ఏఎస్సై గజపతిరావు, కానిస్టేబుల్ విష్ణుకుమార్ అవగాహన కల్పించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం బక్కయ్య, టీచర్లు పాల్గొన్నారు.



నూజివీడు ఎస్ఆర్ఆర్ పాఠశాలలో వ్యాసరచన పోటీలో పాల్గొన్న విద్యార్థులు

పీఆర్సీ కమిటీ వేయాలి

నూజివీడు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): పీఆర్సీ కమిటీని వేసి ఐఆర్‌ను ప్రకటించాలని, పెండింగ్ డీఏలను తక్షణం విడుదల చేయాలని రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు గోవిందరావు డిమాండ్ చేశారు. బుధవారం జరిగిన అసోసియేషన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ దశలవారీగా అయినా డీఏ బకాయిలు విడుదల చేయాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఈమని శేషయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరి సోమయాజులు, బత్తుల లక్ష్మికోటేశ్వరి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గోవిందరావు



అక్కిరెడ్డిగూడెంలో రీ సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజ్‌కుమార్

నిబంధనల ప్రకారం రీ సర్వే జరగాలి

ముసునూరు, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం రీసర్వే చేయాలని తహసీల్దార్ కె.రాజ్‌కుమార్ అన్నారు. పైలెట్ ప్రాజెక్ట్‌గా అక్కిరెడ్డిగూడెంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియ బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఇప్పటివరకు జరిగిన సర్వే రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. రీ సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రీ సర్వే డీటీ పురుషోత్తమ శర్మ పాల్గొన్నారు.

మట్టగుంటలో పారిశుధ్య చర్యలు

కలిదిండి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛ మట్టగుంట తమ లక్ష్యమని సర్పంచ్ అంద్రాజు రత్నమణి, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ దుర్గారావు అన్నారు. గ్రామంలో బుధవారం డ్రెయినేజీల్లో పూడికను, రహదారి పక్కన ముళ్ల పొదలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించారు. అంతర్గత రహదారులపై పేరుకున్న చెత్త కుప్పలను బురదను తొలగించి బ్లీచింగ్ చల్లారు. పంచాయతీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్

ఉప్పుటేరు ప్రక్షాళనతోనే ముంపు సమస్య పరిష్కారం

అసెంబ్లీలో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, మార్చి 5(ఆంధ్రజ్యోతి): కొల్లేరు ముంపు నివారణకు ఉప్పుటేరు ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాలంలో వచ్చే వరదల నుంచి బుడమేరుతో పాటు కొల్లేరు ముంపునకు గురవుతుందని ముంపు నివారణ చర్యలు చేపట్టాలంటే ఉప్పుటేరు ప్రక్షాళనతోనే సాధపడుతుందన్నారు. కైకలూరు నియోజకవర్గంలో కాల్వల్లో కిక్కిస దట్టంగా పెరిగి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వాటిని తొలగించేందుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. జలవనరుల శాఖలో కాల్వల వెంబడి పర్యవేక్షించేందుకు లస్కర్లు లేకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని ఆ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఇరిగేషన్, డ్రెయినేజీ, ఆర్‌అండ్‌బీ పంచాయతీరాజ్ శాఖలలో 40 శాతం పైగా ఉద్యోగుల కొరత ఉందని అవసరాన్ని బట్టి సచివాలయ సిబ్బందిని ఆయా శాఖలకు కేటాయించే దిశగా ఆలోచన చేయాలని శాసనసభ దృష్టికి తీసుకెళ్లారు.

తల్లి మందలించిందని కుమారుడి ఆత్మహత్య

ముదినేపల్లి, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో తిరగడం మాని కూలి పనులకు వెళ్లమని తల్లి మందలించిందన్న కారణంగా ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ముదినేపల్లి మండలం వడాలిలో జరిగింది. గ్రామానికి చెందిన కటికల నాగబాబు (18) కొంతకాలంగా కూలి పనులకు వెళ్లకుండా ఖాళీగా తిరుగుతున్నాడు. మంగళవారం రాత్రి అతని తల్లి కూలి పనులకు వెళ్లనందుకు మందలించగా మనస్థాపానికి గురైన నాగబాబు ఎలుకలు మందు మింగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతనిని ఆస్పత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. నాగబాబు మృతదేహానికి గుడివాడ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి ఎస్ఐ వీరభద్రరావు దర్యాప్తు చేస్తున్నారు.

చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలు

నూజివీడు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): చెల్లని చెక్కు కేసులో ఒకరికి జైలుశిక్ష విధిస్తూ నూజివీడు స్పెషల్ మేజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు చెప్పారు. నూజివీడుకు చెందిన వల్లభనేని బేబి సరోజిని నుంచి 2020 ఏప్రిల్‌లో పెదవేగి మండలం అప్పనవీడుకు చెందిన మందపాటి రమేష్ రూ.4లక్షలు నగదు అప్పు తీసుకున్నారు. బాకీ తీర్మాన నిమిత్తం 2022 మే 24న రూ.5 లక్షలకు చెక్కు ఇచ్చారు. ఖాతాలో నగదు లేకపోవడంతో చెక్ బౌన్స్ అయింది. దీంతో బేబి సరోజిని కోర్టును ఆశ్రయించారు. విచారణ అనంతరం న్యాయాధికారి వేల్పుల కృష్ణమూర్తి నిందితుడికి ఆరు నెలలు జైలుశిక్ష, రూ.6 లక్షలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

రైతుల నమోదుపై ప్రత్యేక డ్రైవ్

నూజివీడు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): తహసీల్దార్ కార్యాలయంలో ఫార్మర్ రిజిస్ట్రీ ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. 8,459 మంది రైతుల వివరాలను రిజిస్ట్రేషన్ చేసినట్లు ఏవో ఆలూరి చాముండేశ్వరి తెలిపారు. మిగిలిన రైతులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తి అయితేనే సున్నావడ్డీ రుణాలు, క్రాప్ ఇన్సూరెన్స్, పీఎమ్ కిసాన్, అన్నదాత సుఖీభవ వంటి పథకాలు వర్తిస్తాయని ఆమె తెలిపారు.

సీనియర్ సిటిజన్స్ సమావేశం

నూజివీడు టౌన్, మార్చి 5 (ఆంధ్రజ్యోతి): విశ్రాంత ఉద్యోగులు లైఫ్ సర్టిఫికెట్లను త్వరితగతిన సబ్ ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బండారు సత్యనారాయణ తెలిపారు. సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం సంయుక్త సమావేశం బుధవారం నిర్వహించారు. లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించే గడువు ముగిసిందని, సర్టిఫికెట్లను సమర్పించని విశ్రాంత ఉద్యోగులు సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో వి.స్టాలిన్ ప్రభాకర్, రిచర్డ్, దిలీప్, లక్ష్మిసరోజిని తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవుల ఉపవాస దినాలు ప్రారంభం

చాట్రాయి, మార్చి 5(ఆంధ్రజ్యోతి): మండలంలో క్రైస్తవుల ఉపవాస దినాలు బుధవారం ప్రారంభమయ్యాయి. చర్చిలలో ఫాదర్స్, పాస్టర్స్ ప్రార్థనలు చేసి మాలధారణలు చేయించారు. మాల ధరించిన క్రైస్తవులు ఉపవాస దినాల్లో తెల్లని వస్త్రాలు ధరించి నిత్యం ప్రార్థనలు, దానధర్మాలు చేస్తారు.